ఒక మనిషి గురించి మరొక మనిషికి
జీవితాంతం గుర్తుండిపోయే
రెండే రెండు విషయాలు..
చేతితో చేసిన సాయం..
మటతో మనసుకు చేసిన గాయం..
-గౌతమ బుద్ధ

Truth of News
PRGI Reg No: APTEL/26/A4782

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 01 | సంచిక : 364 | శనివారం 25 జూలై 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# దిగొచ్చిన కేంద్రం

- తటస్థ వేదికపై సీజేపీతో చర్చలకు అంగీకారం
- కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో కాక్రోచ్ ప్రతినిధులతో
- కేంద్రం భేటీ రెండు డిమాండ్లకు అంగీకారం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సమయం కోరిన మంత్రులు
- కొనసాగుతున్న ఆందోళన
- నేడు మరోసారి చర్చలు

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రారంభించిన ఆందోళనలు దేశవ్యా ప్తంగా వ్యాపించడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దేశ రాజధానిలోని జంతర్ మంతర్‌కు దాదాపు పదివేల మందికి పైగా తరలిరావడంతో చర్చలకు దిగొచ్చింది. మూడు డిమాండ్‌లను సీజేపీ నేతలు ప్రస్తావించగా.. రెండింటికి కేంద్రం అంగీకారం తెలిపింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న ప్రధాన డిమాండ్‌కు ఒక రోజు సమయం కోరడంతో ఢిల్లీలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. సీజేపీ డిమాండ్ మేరకు శుక్రవారం ఒక తటస్థ వేదికపై చర్చలు జరిగాయి. కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన చర్చల్లో కేంద్ర ప్రభుత్వం తరఫున కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్, సీజేపీ ప్రతినిధులు అశుతోష్ రంగ, సౌరవ్ దాస్‌లు పాల్గొన్నారు.



దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ చర్చల్లో నీట్ సహా విద్యావ్యవస్థలోని పలు కీలక అంశాలపై చర్చించారు. డిమాండ్లను సీజేపీ లిఖితపూర్వ కంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. అయితే ఇందులో బాధిత కుటుం బాలకు పరిహారం, ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణ కు కేంద్ర మంత్రులు అంగీకారం తెలిపారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిర్ణయం తీసుకోవడానికి ఒక్కరోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో నేడు కూడా చర్చలు కొనసాగనున్నాయి.


**కేంద్ర మంత్రి రాజీనామాపై సమయం కోరిన కేంద్రం : సీజేపీ ప్రతినిధులు**

కేంద్రం మంత్రులతో చర్చల అనంతరం సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ మీడియాతో మాట్లాడారు. కేంద్రం ముందు మూడు ప్రధాన డిమాండ్లు పెట్టామని తెలిపారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు, మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారంపై కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

- మిగతా 2లో..

## హిమాచల్ ప్రదేశ్‌లో ఘోరం

- వాహనంపై దొర్లిపడిన బండరాళ్లు..
- నవజాత శిశువు సహా 13మంది మృతి



**సిమ్లా - సూర్య వాస్తవం :** వేగంగా వెళుతున్న ఎస్‌యువి వాహనంపై పెద్ద బండరాళ్లు దొర్లిపడటంతో 13మంది మరణించారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహౌల్ -స్పితి జిల్లాలో ఉదయ్‌పూర్-పాంగి రహదారిపై శుక్రవారం

- మిగతా 2లో..



## మేకులున్న లాఠీలతో బాదారు

- విద్యార్థులపై దాడి నిజమే : ఆల్ట్ న్యూస్

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :** జూలై 20న సిజెపి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఛలో పార్లమెంట్' కార్యక్రమంలో విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు జరిపిన దాడులపై వివాదం మరింత ముదురుతోంది. ఈ ఘటనకు సంబంధించి రోజుకో కొత్త ఆధారం వెలుగులోకి వస్తుండగా.... పోలీసులు మేకులు అమర్చిన లాఠీలతో విద్యార్థులపై దాడి చేశారనే

- మిగతా 2లో..

## లీకులకు పాల్పడితే.. మరింత కఠిన చర్యలు

- నూతన బిల్లుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- ప్రవేశ పరీక్షల అక్రమ పద్ధతుల నివారణ
- చట్టంలో కీలక సవరణలకు సిద్ధం

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :**

న్యూఢిల్లీ: ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని మోడీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024

- మిగతా 2లో..



## ప్రధాన్ రాజీనామాపై ప్రతిష్టంభన

- పార్లమెంట్ లోపల, బయట ఆందోళనలు



2లో



## కాక్రోచ్ పార్టీ నిరసనలో పాల్గొననున్న మమతా బెనర్జీ

- జూలై 27న ఢిల్లీలో జరిగే నిరసనలో పాల్గొననున్న బెంగాల్ మాజీ సీఎం
- కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలోని యువత ఉద్యమానికి మద్దతు
- లోక్‌సభలో టీఎంసీ డిప్యూటీ లీడర్‌గా సౌగతా రాయ్ నియామకం

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ

- రంపచోడవరంలో మెగా పేరెంట్- టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి
- మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే
- 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్, 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడి
- గత ప్రభుత్వ అప్పులను తీరుస్తూనే సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామని స్పష్టీకరణ




**అమరావతి - సూర్య వాస్తవం**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మార్కులు తగ్గితే, అది విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మార్కులు తగ్గినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించారని, విద్యారంగంపై ఆయనకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావాలన్న తపనతో ఆయన పనిచేస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో కనిపిస్తున్న మార్పులు చూస్తుంటే ఆనందంగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్' సభలో

- మిగతా 3లో..



## జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు

- వివిధ శాఖల పరిధిలోని నిరుపయోగ స్థలాలు గుర్తించండి : సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశిం చారు. ఈ అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలు గుర్తించాలని అధికారులకు ఆయన సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, వేరేచోట ఆయా శాఖలకు స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. అలా కాకుండా పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలన్నారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

- మిగతా 3లో..

# హిమాచల్ ప్రదేశ్‌లో ఘోరం

(మొదటిపేజీ తరువాయి)

మధ్యాహ్నం ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ఆరునెలల నవజాత శిశువు కూడా ఉంది. వివరాల ప్రకారం.. 15మంది ప్రయాణికులతో కుల్లు నుంచి కిల్లార్‌కి వెళుతున్న ఎస్‌యూవీపై బండరాయి దొర్లిపడటంతో వాహనం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యింది. బండరాయి ఢీకొన్న ధాటికి కారు వెనుక భాగంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సాయంతో ఆర్మీ మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. అయితే అప్పటికే వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో 13మంది మరణించారు. మరో ఇద్దరు వాహనం నుంచి దూకేయడంతో ప్రాణాలతో బయటపడ్డారని లాహౌల్-స్పితి డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, గురువారం ఉదయ్‌పూర్-కిల్లార్ రహదారి మూసివేయబడటంతో వారు టిండి వద్ద చిక్కుకుపోయారు. రహదారి తిరిగి తెరుచుకున్న తర్వాత శుక్రవారం పాంగికి బయలుదేరారు, కానీ వారి వాహనం ప్రమాదానికి గురవడంతో ప్రాణాలు కోల్పోయారు. మృతుల వివరాలు తెలియాల్సి వుంది.

# మేకులున్న లాఠీలతో బాదారు

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపణలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరలయ్యాయి.ఆ వీడియోలు నిజమే : స్వతంత్ర ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థ ఆల్ట్ న్యూస్ఈ వీడియోలు నకిలీవని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు. అనంతరం పిఐబి ఫ్యాక్ట్ చెక్ కూడా స్పందిస్తూ .... వైరల్ అవుతున్న వీడియోలు ఫేక్ అని, ఢిల్లీ పోలీసులు మేకులున్న లాఠీలను ఉపయో గించలేదని పేర్కొంది. అయితే స్వతంత్ర ఫ్యాక్ట్ చెకింగ్ సంస్థ ఆల్ట్ న్యూస్ నిర్వహించిన పరిశీలనలో .... ఆ వీడియోలు నిజమైనవేనని నిర్ధారణ అయినట్లు తన కథనంలో స్పష్టం చేసింది. దీంతో ఈ అంశంపై మరింత చర్చ మొదలైంది.

**పెల్లెట్ గన్స్‌తో దాడి చేశారు : మీడియాతో బాధిత యువకులు**

మరోవైపు, 'ఛలో పార్లమెంట్'లో పాల్గొన్న విద్యార్థులపై పోలీసులు పెల్లెట్ గన్స్‌ను కూడా ఉపయోగించారన్న ఆరోపణలు బయటకు వస్తున్నాయి. గాయపడిన పలువురు విద్యార్థులు మీడియా ఎదుట తమ అనుభవాలను వెల్లడించారు. ఢిల్లీకి చెందిన 25 ఏండ్ల యువకుడు మీడియాతో మాట్లాడుతూ .... పార్లమెంట్ మార్చ్‌లో పాల్గొంటున్న సమయంలో పోలీసులు తనపై పెల్లెట్ గన్స్‌తో కాల్పులు జరిపారని తెలిపాడు.

ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

**బళ్లారి-గుంతకల్ మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్లు రూ.1.264 కోట్లతో రైల్వే లైన్ల ప్రాజెక్టు కేంద్ర మంత్రివర్గం ఆమోదం**

బళ్లారి-గుంతకల్లు మధ్య మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. శుక్రవారం నాడిక్కడ ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు. కర్ణాటకలోని బళ్లారి -- ఆంధ్రప్రదేశ్‌లోని గుంతకల్లు మధ్య మూడు జిల్లాల పరిధిలో మొత్తం 46 కిలోమీటర్ల మార్గానికి రూ.1,264 కోట్లతో మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్, కర్నా టక రాష్ట్రాలకు ప్రయోజనం కలగనుందన్నారు. ఈ ప్రతిపాదిత మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టు వల్ల సుమారు ఏడు లక్షల జనాభా ఉన్న దాదాపు 99 గ్రామాలకు రవాణా సదుపాయాలు మెరుగుపడనున్నాయని అన్నారు. రూ.3,030 కోట్లతో రసాయన పార్కుల కోసం 'భవ్య రసాయన' పథకానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. వేదావతి నదిపై 762 మీటర్ల పొడవైన మెగా రైల్వే వంతెనను నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. అలాగే 7 ప్రధాన వంతెనలు, 52 చిన్న వంతెనలను కూడా నిర్మించనున్నట్లు చెప్పారు. రైల్వే మల్టీ ట్రాకింగ్ ప్రాజెక్టుకు అవసరమైన భూమిలో సుమారు 80 శాతం ఇప్పటికే అందుబాటులో ఉందని, మూడేండ్లలో పనులను పూర్తి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుతో 99 గ్రామాలకు రైల్వే అనుసంధానం లభిస్తుందని వెల్లడించారు. రైల్వే సామర్థ్యం పెంపు, రద్దీ తగ్గింపే ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# కాక్రోచ్ పార్టీ నిరసనలో పాల్గొననున్న మమతా బెనర్జీ

### - జూలై 27న ఢిల్లీలో జరిగే నిరసనలో పాల్గొననున్న బెంగాల్ మాజీ సీఎం
### - కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలోని యువత ఉద్యమానికి మద్దతు
### - లోక్‌సభలో టీఎంసీ డిప్యూటీ లీడర్‌గా సౌగతా రాయ్ నియామకం

న్యూఢిల్లీ-సూర్య వాస్తవం

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ జాతీయ రాజకీయాల్లో మరోసారి కీలక పాత్ర పోషించేందుకు సిద్ధమవుతున్నారు. పోటీ పరీక్షల్లో సంస్కరణలు కోరుతూ యువత చేపట్టిన ఉద్యమానికి ఆమె తన మద్దతు ప్రకటించారు. ఇందులో భాగంగా, జూలై 27న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో తాను స్వయంగా పాల్గొంటానని శుక్రవారం వెల్లడించారు. ఇదే సమయంలో, లోక్‌సభలో టీఎంసీ పార్లమెంటరీ పార్టీ ఉప నాయకుడిగా సీనియర్ నేత సౌగతా రాయ్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. బీర్భూమ్ నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు లోక్‌సభకు ఎన్నికైన నటి, రాజకీయ నాయకురాలు శతాబ్ది రాయ్ స్థానంలో సౌగతా రాయ్ బాధ్యతలు చేపట్టనున్నారు.ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో, ఆ పార్టీకి చెందిన 20 మంది ఎంపీలు త్రిపుర కేంద్రంగా పనిచేసే 'నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా'లో చేరారు. వారిలో శతాబ్ది రాయ్ కూడా ఉన్నారు.మూడు రోజుల క్రితం కోల్‌కతాలో జరిగిన తృణమూల్ కాంగ్రెస్ అమరవీరుల దినోత్సవ ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించారు. తాను త్వరలో కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలో పాల్గొంటానని ఆ సందర్భంగా వెల్లడించారు. తాజాగా, ఆ నిరసనలో పాల్గొనే తేదీని ఆమె ఖరారు చేశారు. తన ఢిల్లీ పర్యటనలో మమతా బెనర్జీ కేవలం సీజేపీ నేతృత్వంలోని ఉద్యమంలో పాల్గొనడానికే పరిమితమవుతారా లేక వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులతో, ముఖ్యంగా కాంగ్రెస్ అగ్రనాయకత్వంతో సమావేశాలు నిర్వహిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది.

# దిగొచ్చిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

రాజీనామాకు సంబంధించి శనివారం వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు. సీజేపీ నేత అశుతోష్ రంక మీడియాతో మాట్లాడుతూ.. ధర్మేంద్ర ప్రధాన్ ను ప్రభుత్వం త్వరగా విధుల నుంచి తొలగిస్తుందని అనుకుంటున్నామని తెలిపారు.

**నేడు మరోసారి చర్చలు : జేపీ నడ్డా**

చర్చల అనంతరం కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా మీడియాతో మాట్లాడారు. దాదాపు రెండు గంటల పాటు చర్చలు జరిగాయని.. సీజేపీ ప్రతినిధులు మూడు ముఖ్యమైన డిమాండ్లను ఉంచారని వెల్లడించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై శనివారం మరో మారు చర్చిస్తామని వెల్లడించారు.

**విద్యార్థులపై దాడి చేసి పోలీసులపై చర్యలపై సీజేపీ వెబ్‌సైట్**

విద్యార్థులపై జులై 20న జరిగిన దాడుల్లో పాల్గొన్న పోలీసులను గుర్తించి, చట్టపరమైన చర్యలు చేపట్టేందుకు సీజేపీ వెబ్‌సైట్‌ను ప్రారంభించనున్నారు. 'సంసద్ చలో' మార్చ్ సందర్భంగా జులై 20న జరిగిన అణచివేతలో పాల్గొన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిని గుర్తించేందుకు, నిరసనకారుల నుంచి ఫోటోలు, వీడియోలను సేకరించడానికి ఒక ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్నట్టు సీజేపీ శుక్రవారం ప్రకటించింది. ఆ అధికారులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించి, కోర్టును ఆశ్రయిస్తామని కూడా తెలిపింది. సీజేపీ ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, పోలీసు చర్య సమయంలో పోలీసు సిబ్బంది విద్యార్థులపై దాడి చేశారని, మహిళా నిరసనకారులను వేధించారని ఆరోపించారు. "మేము ముందే ప్రకటించినట్లుగా, విద్యార్థులపై దాడి చేసి, వారిని గాయపరిచి, యువతులను లైంగికంగా వేధించిన ప్రతి అధికారిని హెచ్చరించడం జరిగింది. మేము మౌనంగా ఉండబోము. ప్రతీదీ గుర్తుంచుకుంటాం," అని ఉద్ఘాటించారు. అణచివేతలో పాల్గొన్నారని ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను అప్‌లోడ్ చేయాలని ఆయన నిరసనకారులకు విజ్ఞప్తి చేశారు. గుర్తించిన అధికారులపై ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయకపోతే, తమ పార్టీ కోర్టులను ఆశ్రయిస్తుందని దాస్ గారు అన్నారు. జంతర్ మంతర్ వద్ద అత్యాధునిక ఫేషియల్ రికగ్నిషన్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేశారు. ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనల సందర్భంగా తమ సిబ్బంది విపరీతమైన బలప్రయోగం చేశారని, పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరిపారని వచ్చిన ఆరోపణలపై ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) విచారణ ప్రారంభించిందని అధికారులు శుక్రవారం తెలిపారు.

**విద్యార్థులకు జేఎన్‌యూ, డీయూ బెదిరింపులు**

నిరసనలో పాల్గొనవద్దని జేఎన్‌యూ, ఢిల్లీ విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు, ఉద్యోగులకు సూచించాయి. ఈ చట్టపరమైన చర్యల వల్ల విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలుగుతుందని, వృత్తిపరమైన అవకాశాలపై ప్రభావం పడుతుందని వెల్లడించింది. అదేవిధంగా వ్యక్తిగత భద్రతకు కూడా ముప్పు వాటిల్లే అవకాశం ఉందని, అందుకే వాటికి దూరంగా ఉండాలని పేర్కొంది. దీన్ని ప్రతిపక్ష నేతలు తప్పుపట్టాయి. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ ప్రజాస్వామ్య హక్కులను అమలు చేస్తున్న విద్యార్థులను ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు.జంతర్ మంతర్ పరిసరాల్లో ఇంటర్నెట్ నిలిపివేతకు వ్యతిరేకంగా న్యాయ సేవల సంస్థ సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్, ఇండియా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. మరోవైపు సిజెపిపై ఎన్ఐఎ విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. నిరసనకారులపై హింసకు సంబంధించి దాఖలైన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు ఈనెల 27న విచారించనుంది. జాతీయ మీడియా ఈ నిరసనను కప్పిపుచ్చగా, అంతర్జాతీయ మీడియా దీనిని ప్రచురించింది. ఇదిలా ఉండగా, 2024 నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న సంజీవ్ ముఖ్యాపై ఎలాంటి ఆధారాలు లేవని సిబిఐ తెలిపింది.

**విజయవంతమైన ఉద్యమం: గీతాంజలి ఆంగ్మో**

"ఈ ఉద్యమం యావత్ దేశాన్ని మేల్కొల్పింది కాబట్టి, ఇది మాకు చాలా విజయవంతమైన ఉద్యమంగా నిలిచింది. ఇది ప్రస్తుత ప్రభుత్వానికి కూడా ఒక హెచ్చరికగా ఉపయోగపడుతుందనిఆశిస్తున్నాను" అని వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సతీమణి గీతాంజలి జె. ఆంగ్మో అన్నారు.

**ఆంక్షల నీడలో జంతర్ మంతర్ భారీగా తరలివస్తున్న యువత**

విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండ్‌ను కేంద్రం అంగీకరించకపోవడంతో జంతర్ మంతర్‌కు వస్తున్న ప్రజల సంఖ్య గణనీయంగా పెరిగింది. భగత్ సింగ్, మహాత్మా గాంధీ, బి.ఆర్. అంబేద్కర్, చేగువేరాల చిత్రాలతో మరింత మంది నిరసన ప్రదేశానికి వచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, మోడీలకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. మెట్రో స్టేషన్లను మూసివేయడం, ఇంటర్నెట్‌ను నిరోధించడం, ట్రాఫిక్‌ను నియంత్రించడంతో ఆందోళనను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు విఫలమయ్యాయి. నిరసనకారులకు ఆహారం అందకుండా నిరోధించాలని కూడా ప్రభుత్వం నిర్ణయించింది. నిరసన ప్రాంతాల్లో ఆహారం పంపిణీ చేసే ఆన్‌లైన్ వేదికలపై ఆంక్షలు విధించారు. వాంగ్‌చుక్ తన నిరాహార దీక్షను విరమించినప్పటికీ, ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తూ తమ నిరసనను కొనసాగిస్తామని నిరసనకారులు తెలిపారు. వాంగ్‌చుక్ ఇంకా ఆస్పత్రిలోనే ఉన్నారు.దేశవ్యాప్తంగా విద్యార్థి, యువజన నిరసనలు వ్యాపించిన నేపథ్యంలో, ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల్లో శిక్షను కఠినతరం చేసే సవరణ బిల్లుకు శుక్రవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. ప్రశ్నపత్రాల లీకేజీని నివారించడానికి శుక్రవారం మరిన్ని నిర్ణయాలు తీసుకోనున్నట్లు ప్రధానమంత్రి గురువారం రాత్రి విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో ప్రకటించారు. జులై 20న పార్లమెంటుకు జరిగిన మార్చ్ సందర్భంగా నిరాయుధ నిరసనకారులపై రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) పెల్లెట్ గన్‌లను ఉపయోగించిందన్న మీడియా నివేదికలను సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) ధ్రు వీకరిస్తోంది" అని ఒక అధికారి శుక్రవారం తెలిపారు.

జాతీయ రాజధానిలో పౌరులపై భద్రతా దళాలు పెల్లెట్ గన్‌లను ఉపయోగించినట్లు స్పష్టం అయింది.మరోవైపు ఆందోళనను అణచివేసేందుకు కూడా కేంద్రం కూడా చర్యలు తీసుకుంటోంది. మరో పది సిఆర్‌పిఎఫ్ కంపెనీలను ఢిల్లీకి రప్పించారు. సుప్రీంకోర్టు అభ్యర్థించినప్పటికీ, అన్ని మెట్రో స్టేషన్లను తెరవడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదు. కేవలం మండి హౌస్, సెంట్రల్ సెక్రెటరియట్ మెట్రో స్టేషన్లను మాత్రమే తెరిచారు. ఇంకా 15 మెట్రో స్టేషన్లు మూసివేతలో ఉన్నాయి. నిరసన ప్రదేశానికి చేరుకుంటున్న ప్రజలను హర్యానా సరిహద్దు వద్ద నిలిపివేశారు.

**47 మంది అధికారులపై ఎన్టీఏ వేటు**

పటిష్టమైన పరీక్షా సంస్కరణలను తీసుకురావాలనే ప్రయత్నంలో భాగంగా, జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్టీఏ) 47 మంది అధికా రులను విధుల నుంచి తొలగించింది. వీరిలో కొంతమంది అధికా రులపై చట్టపరమైన, క్రిమినల్ చర్యలు కూడా తీసుకోనున్నారు.

# ప్రధాన్ రాజీనామాపై ప్రతిష్టంభన

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసా గుతోంది. పార్లమెంట్ లోపల, వెలుపల ఆందో ళనలు కొనసాగుతు న్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని మోడీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. శుక్రవారం పార్లమెంట్ ప్రాంగ ణంలోని మకర్ ద్వార్ వద్ద వర్షంలో ఇండియా బ్లాక్ ఎంపీలు నిరసన చేపట్టారు. 'ప్రధాన్‌ను తొలగించాలి' అనే బ్యానర్లతో నినాదాల హోరెత్తించారు. మరోవైపు లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడింది. తిరిగి ప్రారం భమైన సభలో కూడా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగింది. దీంతో సభను స్పీకర్ సోమవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ నీట్‌పై చర్చ జరగాలని ప్రతిపక్షాలతో చెప్పానని, దేశ ప్రజలకు ప్రధాని మోడీ హామీ ఇచ్చారని అన్నారు. సోనమ్ వాంగ్‌చెక్ తన నిరాహార దీక్షను విరమించారని, ఆయన కూడా సభలో చర్చ జరగాలని ఆశించారని తెలిపారు. ఒకవేళ ఇప్పుడు చర్చ చేపట్టకుంటే, అది సరైన సందేశాన్ని ఇవ్వబోదని అన్నారు. ఈ అంశంపై చర్చకు ముందుగా మంత్రి ప్రధాన్ తప్పనిసరిగా రాజీనామా చేయాల్సిందేనని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తన పేరు ప్రస్తావించి, సభా కార్యకలాపాలను కొనసాగించనివ్వాలని ప్రతిపక్ష ఎంపీలను కోరినప్పటికీ, తనను సభలో మాట్లాడటానికి అనుమతించలేదని అన్నారు. "సాధారణ నియమావళి ప్రకారం, ఎవరైనా ఒకరి పేరు ప్రస్తావిస్తే ఆ వ్యక్తి స్పందించాలి, కానీ నేను స్పందించాలనుకున్నప్పుడు నన్ను మాట్లాడనివ్వలేదు" అని అన్నారు. "నేను ఈ విషయాన్ని స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. విద్యార్థులకు మూడు డిమాండ్లు ఉన్నాయి. అవినీతిపరుడైన విద్యాశాఖ మంత్రి పదవి నుంచి వైదొలగాలి. విద్యార్థులను కొట్టిన వారిపై చర్య తీసుకోవాలి. ప్రధానమంత్రి విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. "ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే వరకు మేము ఎలాంటి చర్చలు జరపబోము" అని అన్నారు.

**రాజ్యసభలోనూ..**

రాజ్యసభలో కూడా నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రతిపక్షలు చర్చకు పట్టుపట్టాయి. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేశారు. తొలుత 12 గంటలకు సభ వాయిదా వేశారు. ఆ తరువాత ప్రారంభమైన సభలో కూడా ప్రతిపక్ష సభ్యులు ప్రధాన్ రాజీనామాకు పట్టుపట్టారు. దేశ రాజధానిలో నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ తో సహా పోలీసుల చర్య గురించి మాట్లాడటానికి రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడైన మల్లికార్జున్ ఖర్గే లేచారు. సభలో గందరగోళం చెలరేగడంతో మధ్యాహ్నం గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో వందేమాతరం బిల్లును ప్రవేశపెట్టిన వెంటనే, ప్రతిపక్ష ఎంపీల నిరసనలు కొనసాగుతుండటంతో సభను సోమవారానికి వాయిదా వేశారు.

**రాజ్యసభలో వందేమాతరం బిల్లు విద్యార్థుల ఆందోళన నుంచి దృష్టి మళ్లించడానికే ఇది: ప్రతిపక్షం**

వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది. శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టారు. "1971 నాటి 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ చట్టం'ను సవరించడానికి ఉద్దేశించబడింది. ప్రస్తుత చట్టం ప్రకారం, జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం వంటి జాతీయ చిహ్నాల పట్ల అగౌరవ చర్యలకు పాల్పడిన వారికి మూడేండ్ల వరకు జైలు శిక్ష విధించబడుతుంది. ప్రతిపాదిత సవరణ వందేమాతరానికి కూడా అదే విధమైన రక్షణను కల్పించాలని కోరుతోంది. ఈ బిల్లు ప్రకారం, జాతీయ గీతాన్ని ఆలపించడంలో ఆటంకం కలిగించినా లేదా ఏ రూపంలోనైనా దానిని అవమానించినా, అది చట్టరీత్యా శిక్షార్హమైన చర్య అవుతుంది" అని పేర్కొన్నారు. అయితే.. ఈ బిల్లుపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలుపుతూ సభలోనే ఆందోళనకు దిగారు. బిల్లు వ్యక్తిగత స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులను కాలరాస్తోందని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ 'జాతీయ గౌరవానికి అవమానాల నివారణ (సవరణ) బిల్లు'ను ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ రూల్ 67 కింద నోటీసు ఇచ్చారు. "ఒక చట్టంతో దేశభక్తిని, జాతీయవాదాన్ని సృష్టించలేరు" అని ఆయన అన్నారు. రాజ్యాంగం, పార్లమెంటు ఉద్దేశపూర్వకంగా నిలిపివేసిన వందేమాతరంకు చట్టబద్ధమైన హోదా, శిక్షా రక్షణను కల్పించడమే ఈ బిల్లు లక్ష్యమని బ్రిట్టాస్ అన్నారు. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ 1950 జనవరి 24 నాటి ప్రకటనను ఉటంకించారు. ఈ విషయంపై రాజ్యాంగ పరిషత్ అధికారిక తీర్మానాన్ని ఆమోదించకూడదని నిర్ణయించుకుందన్న విషయాన్ని అది విస్మరించిందని పేర్కొన్నారు. ఫలితంగా, ఆ ప్రకటనకు ఎన్నడూ రాజ్యాంగ బలం చేకూరలేదని ఆయన అన్నారు. దాదాపు మూడేళ్ల చర్చల అనంతరం రాజ్యాంగ పరిషత్తు జాతీయ గీతానికి, జాతీయ గేయానికి సమాన రాజ్యాంగ హోదా ఇవ్వకూడదని నిర్ణయించుకుందని, ఈ బిల్లు దాన్ని మార్చడానికి ప్రయత్నిస్తోందని బ్రిట్టాస్ పేర్కొన్నారు. వందేమాతరం మొదటి రెండు చరణాలకే అధికారిక వినియోగాన్ని పరిమితం చేసే చారిత్రక ఏకాభిప్రాయాన్ని కూడా ఆయన ఉదహరించారు. ఈ బిల్లు, రాజ్యాంగం, జాతీయ పతాకం, జాతీయ గీతం పట్ల గౌరవాన్ని ప్రాథమిక విధులుగా పేర్కొనే ఆర్టికల్ 51ఎ(ఎ)కి విరుద్ధంగా ఉందని, అందులో జాతీయ గీతం గురించి ప్రస్తావించలేదని ఆయన అన్నారు. 1971 నాటి జాతీయ గౌరవ అవమానాల నివారణ చట్టాన్ని కూడా ఉదహరించారు. దీని ప్రకారం పార్లమెంట్ సెక్షన్ 3 కింద శిక్షా రక్షణను కేవలం జాతీయ గీతానికి మాత్రమే పరిమితం చేసిందని అన్నారు.

బిజో ఇమ్మాన్యుయేల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసులో సుప్రీంకోర్టు తీర్పును ఉటంకిస్తూ జాతీయ గీతానికి సంబంధించిన ప్రవర్తనను నేరంగా పరిగణించడం వాక్ స్వాతంత్ర్యం, అంతరాత్మ స్వేచ్ఛ, మత స్వేచ్ఛను పరిమితం చేస్తుందని పేర్కొన్నారు. ఆర్టికల్స్ 14, 19(1)(ఎ), 21, 25 కింద ఆందోళనలను లేవనెత్తారు. జనవరిలో హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాతీయ గేయంపై ప్రోటోకాల్ ఉత్తర్వులు జారీ చేసినప్పుడు, ఆ ప్రోటోకాల్‌కు ఎటువంటి శిక్షాత్మక పరిణామాలు లేవనే ఏకైక కారణంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడానికి నిరాకరించిందని, అయితే ఈ బిల్లు ఆ వైఖరిని తలకిందులు చేస్తుందని ఆయన అన్నారు. బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతి నిరాకరించాలని చైర్మన్ సిపి రాధాకృష్ణన్‌ను బ్రిట్టాస్ కోరారు. సిపిఐ ఎంపి పి. సంతోష్ కుమార్ మాట్లాడుతూ కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన నుండి దృష్టి మరల్చడానికే వందేమాతరం బిల్లును తీసుకువచ్చారని పేర్కొన్నారు. "నాకు వందేమాతరం అంటే చాలా ఇష్టం, కానీ ఈ బిల్లు ఠాగూర్, బంకిం చంద్రల మధ్య విభేదాలు సృష్టించాలని చూస్తున్నందున నేను దీనిని

# సంపాదకీయం

## కాంగ్రెస్ పార్టీకి నీట్ బూస్ట్




**జా**తీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందా అన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. నీట్ పేపర్ లీకేజీ ఉదంతంపై విద్యార్థులు చేపట్టిన ఆందోళనలు, ఢిల్లీలో జరిగిన లాఠీచార్జిని నిరసిస్తూ లోక్‌సభలో విపక్ష నేత (ఎల్ఓపీ) రాహుల్ గాంధీ చేపట్టిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో పలు రాష్ట్రాల్లో కాంగ్రెస్ కార్యాలయాలపై జరిగిన దాడులు ఆ పార్టీకి రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెడుతున్నాయనే విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఈ పరిణామాలు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పునరుజ్జీవ ప్రయత్నాలకు ఊతమిస్తాయా అన్న కోణంపైనా విస్తృత చర్చ జరుగుతోంది దేశాన్ని సుదీర్ఘకాలం పాలించిన గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్. అయితే ఇదంతా గతం, ఇప్పుడు పరిస్థితి వేరు. గతం ఒక ఘన చరిత్ర అన్నట్లుగానే కొన్నాళ్లుగా కాంగ్రెస్ పరిస్థితి తయారైంది. అయితే ఇప్పుడు పరిస్థితులు కుదటపడుతున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. 2014లో కేంద్రంలో అధికారం కోల్పోయి, ఆ తర్వాత వరుసగా జరిగిన రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో వైఫల్యంతో కాంగ్రెస్ పార్టీ కుదేలైంది. 2014, 2019 సార్వత్రిక ఎన్నికల్లో కనీస ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేకపోయింది. అయితే గత పార్లమెంటు ఎన్నికల్లో 99 సీట్లతో ప్రతిపక్షంగా నిరూపించుకున్న కాంగ్రెస్ ఇప్పుడు అధికార ఎన్డీఏ, మరీ ముఖ్యంగా బీజేపీపై వెన్నుచూపని పోరాటం చేస్తుండటం హాట్ టాపిక్ అవుతోంది. లోక్ సభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ ఇప్పుడు సరికొత్త పంథాతో రాజకీయం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. జాతీయ పార్టీగా ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ మిగిలిన విపక్షాలను కలుపుకుని పోవడంలో గతం కంటే మెరుగైన విధంగా పనిచేస్తోందని అంటున్నారు. కాకపోతే ఆయా పార్టీలు స్థానిక పరిస్థితులు, అంతర్గత కారణాలతో నిర్లిప్తంగా మారుతున్నా, ఆయా ప్రాంతీయ పార్టీల అగ్ర నాయకత్వానికి కాంగ్రెస్ అండగా నిలుస్తూ తనను తాను మలుచుకుంటున్న తీరు ఆకట్టుకుంటోందని అంటున్నారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలోనూ కాంగ్రెస్ దూకుడుగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధాని మోదీ ఇంటి ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాను ఇందుకు తాజా ఉదాహరణగా చూపుతున్నారు. వారసత్వంగా కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన రాహుల్.. ఆ పార్టీకి పునరుజ్జీవం తేవడానికి ఎంతో ప్రయత్నిస్తున్నారు. అయితే వరుసగా మూడు ఎన్నికల్లో ఆయన వైఫల్యం చెందినా నాయకుడిగా ఇప్పుడిప్పుడు తనను తాను నిరూపించుకుంటున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా 2024 ఎన్నికల ముందు నుంచి రాహుల్ తీరులో మార్పు వచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారత్ జోడో యాత్ర ద్వారా పాదయాత్ర చేసి ప్రజలకు దగ్గరయ్యేలా ప్రయత్నాలు చేసిన రాహుల్ ఇప్పుడు దేశం ఏం కోరుకుంటుందన్న విషయమై అవగాహన పెంచుకున్నారని అంటున్నారు. దీంతో సమయానుకూలంగా స్పందిస్తూ కాంగ్రెస్ పార్టీని చక్కదిద్దేలా చురుగ్గా అడుగులు వేస్తున్నారని చెబుతున్నారు ప్రస్తుతం నీట్ పేపర్ లీక్ వ్యవహారం జాతీయస్థాయిలో కుదిపేస్తుండగా, ఈ విషయంలో కాంగ్రెస్ ఎంటర్ అయిన తీరుతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయిందనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ విషయమై సుదీర్ఘ పోరాటం జరుగుతుండగా, ఈ నెల 20న నిర్వహించిన పార్లమెంట్ మార్చ్ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిందని అంటున్నారు. ఆ రోజు కేంద్ర బలగాలు విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ రాహుల్ గాంధీ చేసిన మెరుపు ధర్నా దేశవ్యాప్తంగా విస్తృత చర్చకు దారితీసింది. అంతేకాకుండా 21న రాహుల్ తోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు కూడా కేంద్రంపై ఒత్తిడి చేసేలా ఆందోళనలు చేయడం, ఈ విషయంలో బీజేపీ కూడా ఒక అడుగు వెనక్కి తగ్గినట్లు సంకేతాలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి సానుకూలంగా మారిందనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. మొత్తానికి తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీకి బూస్ట్ ఇచ్చినట్లుగా చెబుతున్నారు మరో వైపు ట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు కొనసాగిస్తున్న ఆందోళనలపై బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత కొన్ని రోజులుగా ఢిల్లీ వీధుల్లో నిరసనలు కొనసాగించడం చాలా బాధకరమని ఆయన అన్నారు. పరీక్షలపై వారి ఆందోళనలు, సమస్యలు నిజమైనవని, సానుభూతితో పరిష్కరించాలని ఆయన సూచించారు. దీనిని బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా చూడరని తాను ఆశిస్తున్నానని కేంద్ర ప్రభుత్వానికి చురకలంటించారు. ఇటువంటి చర్యలు వికసిత్ భారత్ లక్ష్యానికి అనేక వర్గాలను దూరం చేస్తుందని ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన యువ విద్యార్థులు కొన్ని రోజులుగా న్యూఢిల్లీ రోడ్లపై పడిగాపులు కాయడం తీవ్ర బాధాకరం... పరీక్షల వ్యవస్థలపై వారి ఆందోళనలు, భయాలు సమస్యలు నిజమైనవి... వాటికి సానుభూతితో, దీర్ఘకాలిక పరిష్కారాలతో బదులివ్వాలి... దీనిని కేవలం బలప్రయోగం ద్వారా అణచివేసే శాంతిభద్రతల సమస్యగా మాత్రమే చూడరని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.. నిరసనలు తెలుపుతున్న మహిళలు, యువతులపై క్రూరంగా వ్యవహరించడం నన్ను తీవ్రంగా కలచివేసింది... ఇలాంటి బలప్రయోగం దేశాన్ని 'వికసిత్ భారత్‌గా' తీర్చిదిద్దాలనే జాతీయ లక్ష్యం నుంచి అనేక వర్గాలను దూరం చేస్తుంది" అని మురళీ మనోహర్ జోషీ కేంద్రంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు.

# దేవాదాయ శాఖలో అవినీతి తిమింగళం



- గుడి నిర్మాణ నిధుల విడుదలలో లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన దేవాదాయశాఖ సహాయ కమిషనర్
- ఈ నెల 31న రిటైర్డ్ అవుతున్న అసిస్టెంట్ కమీషనర్ మల్లికార్జున ప్రసాద్
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న డిఎస్పి ప్రసాద్ రెడ్డి, సిఐ అమిత్ ఖాన్

అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం

అనంతపురం జిల్లాలో అవినీతి తిమింగలాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇటీవల వైట్ కలర్ జాబ్ చేస్తున్న అధికారుల అవినీతి బండారాన్ని అవినీతి నిరోధక శాఖ అధికారులు వెలుగులోకి తెస్తున్నారు. అవినీతికి పాల్పడే అధికారులపై....అవినీతి అనుమానాలున్న అధికారుల ప్రత్యేక జాబితాను రూపొందించి ఏసీబీ ఉక్కుపాదం మోపుతోంది.... తాజాగా అనంతపురం జిల్లా దేవాదాయ శాఖలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన ట్రాప్‌లో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ గంజి మల్లికార్జున ప్రసాద్ రూ.25 వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.... అసలు వివరల్లోకి వెళితే.....పుట్లూరు మండలంలోని రామలింగాయపల్లి గ్రామంలో ఆలయ నిర్మాణం కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీ వాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధుల విడుదలలో లంచం డిమాండ్ చేసిన దేవాదాయశాఖ అనంతపురం సహాయ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, మంజూరైన నిధుల్లో ఇప్పటికే ఒకసారి రూ.5 లక్షలు, మరోసారి రూ.2 లక్షల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. మిగిలిన రూ.2 లక్షల చెక్కులను విడుదల చేయాలంటే రూ.30 వేల లంచం ఇవ్వాలని సహాయ కమిషనర్ డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో రూ.25 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి నిందితుడిని రిమాండ్‌కు తరలిస్తామని ఏసీబీ అధికారులు మీడియా సమావేశంలో వెల్లడిం చారు. ఈ సందర్భంగా ప్రజలకు అవినీతి నిరోధక శాఖ అధికారులు కీలక సూచనలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధుల్లో భాగంగా చేయాల్సిన పనులకు నగదు లేదా ఇతర రూపంలో లంచం డిమాండ్ చేస్తే వెంటనే ఏసీబీ టోల్‌ఫ్రీ/హెల్ప్‌లైన్ 9440446182కు ఫోన్ ద్వారా లేదా 9440446106 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందిన ఫిర్యాదులపై వెంటనే విచారణ చేపట్టి అవినీతి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు స్పష్టం చేశారు.

**సలామ్ డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ హమీద్ ఖాన్**

24గంటలు ప్రజల సంరక్షణే ధ్యేయంగా పని చేసే కొందరు అధికారులలో డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ హమీద్ ఖాన్ ముందు వరసలో వీరు ఉంటారు. అందులో అవినీతి అధికారులపై ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు డీఎస్పీ ప్రసాదరెడ్డి, సీఐ హమీద్ ఖాన్ చేస్తున్న దాడులు రెడ్ హ్యాండెడ్ పట్టుకుంటున్న తీరు అభినందనీయం. జిల్లాలో లంచాలు తీసుకుంటున్న అధికారులను వీరు నిరంతరం పట్టుకుంటున్నారు రెవెన్యూ, పోలీసు, మున్సిపాలిటీ, దేవాదాయ శాఖ వంటి వివిధ శాఖల్లో తనిఖీలు



నిర్వహిస్తు బాధితుల ఫిర్యాదుల ఆధారంగా మాటువేసి లంచం డబ్బులతో సహా అధికారులను రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేస్తున్నారు. అవినీతి కేసుల్లో పకడ్బందీ దర్యాప్తుతో పాటు చట్టపరమైన చర్యలను వేగ వంతం చేస్తున్నా వీరికి సూర్య వాస్తవం దినపత్రిక తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ

(మొదటిపేజీ తరువాయి)

ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "కొత్త జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి ఇక్కడికి వచ్చాను. ఇవాళ నేను కూడా టీచర్‌ను అయ్యాను, నేర్చుకోవడానికి విద్యార్థిని అయ్యాను, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా మారాను" అని అన్నారు. పిల్లల భవిష్యత్తు బాధ్యతను తల్లిదండ్రులిద్దరూ తీసుకోవాలని, అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని, దీని ఫలితంగానే ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇదే ప్రభుత్వ స్కూళ్ల సత్తా అని గర్వంగా ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారికి అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

**'బడి కోసం' పోర్టల్ ఆవిష్కరణ.. వెల్లువెత్తిన విరాళాలు**

ఈ కార్యక్రమంలో భాగంగా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం హైస్కూల్‌కు మీ-సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ లక్ష రూపాయల విరాళం ప్రకటించగా, నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్లు విరాళం ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు నింపింది.

**ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పాలన**

రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మనసుంది కాబట్టే 'తల్లికి వందనం' వంటి పథకాలను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టిందని విమర్శించారు. తాము ఆ ఆస్తులను విడిపిస్తూ, అధిక వడ్డీల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నుంచి, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన ఠంచనుగా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, సంక్షేమం-అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామన్నారు.

**ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు భవిష్యత్**

ఉపాధ్యాయులకు సముచిత గౌరవం ఇస్తున్నామని, పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని గత ప్రభుత్వానికి భిన్నంగా, తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని పూర్తిచేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నియమితులైన కొత్త ఉపాధ్యాయులను అభినందించారు. విశాఖకు గూగుల్ వంటి సంస్థలను తీసుకువస్తున్నామని, ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్ పోర్టుకు శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే, రాష్ట్రంలోనే పెద్ద ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. అనంతరం గంజాయి సాగును నిర్మూలించి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామని, జీవో నెంబర్-3పై చర్చించి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

కాగా క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం విదితమే. ఒక్కో ఫ్లాట్ ను దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. దీని నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షల ఖర్చవుతుండగా ప్రభుత్వం ఇందులో 5 లక్షల రూపాయల సబ్సిడీని అందిస్తోంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు తన వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. ల్యాండ్ కాస్ట్‌ను మాత్రం పూర్తిగా ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రాజేంద్ర నగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించనుంది. ఈ క్రమంలోనే ఆయా పరిధిల్లో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆర్ అండ్ బీ స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, డీజీపీ సీవీ ఆనంద్, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీలు ఎన్.శ్రీధర్, వి.శేషాద్రి, రెవెన్యూ సెక్రెటరీ లోకేష్ కుమార్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హౌజింగ్ స్పెషల్ సెక్రెటరీ వీపీ గౌతమ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**డ్రగ్స్‌పై ఉక్కుపాదం అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**
**విద్యాసంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని సూచన**

డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ విషయంలో సర్కారు సీరియస్ గా దృష్టి సారించిందని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల సంస్థలోని బోధి పెవిలియేన్‌లో ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిరోధం, భద్రతా కమిటీలపై అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. సీఎం మాట్లాడుతూ విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని సూచించారు. క్యాంపస్ లోపల డ్రగ్స్ కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్ని బాధ్యులను చేయాల్సిందేనని స్పష్టం చేశారు. క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని వివరించారు. విద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని సూచించారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని చెప్పారు. డ్రగ్స్ కు సంబంధించి సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఆదేశించారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం ఈ మూడు దశలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్ కు తరలించాలని చెప్పారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని పరిశీ లించాలని పేర్కొన్నారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సలహాదారులు కె.రామకృష్ణారావు తదితరులతోపాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైల్వే కాంట్రాక్టర్‌పై రైతులు ఆగ్రహం...!

**- ముందస్తు సమాచారం లేకుండా రైతుల భూములలో కంచే నాటుతున్న రైల్వే కాంట్రాక్టర్లు**

**- కాంట్రాక్టర్లకు వంత పాడుతున్న రైల్వే అధికారులు**



**పామిడి - సూర్య వాస్తవం :** రైల్వే ప్రాజెక్టుల కోసం తమ భూముల్లో ముందస్తు అనుమతి లేదా సరైన పరిహారం ఇవ్వకుండా పనులు చేపడుతున్న రైల్వే కాంట్రాక్టర్లపై పామిడి రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు... అసలు వివరల్లోకి వెళితే...... పామిడి మేజర్ పంచాయతీ పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన రైతుల భూములలో రైల్వే కాంట్రాక్టర్ శుక్రవారం ఫినిషింగ్ కంచే నాటుతుండడంతో రైతులు ఆగ్రహం వ్యక్తపరిచారు. రైతులకు తెలియపరచకుండా వారి భూములలో అక్రమంగా దాదాపు 20అడుగులు రైతుల భూముల్లో ఫినిషింగ్ రాళ్లు పాతుతుండగా ఉక్కుముడిగా రైతులు నిలిపివేశారు. ఈ విషయాన్ని మండల సర్వేయర్ దృష్టికి తీసుకువెళ్లి, అన్యాయంగా అక్రమంగా రైల్వే హద్దు కాదని మాభూములలో పాదుతున్నారని విన్న వించుకున్నారు. ఆయన వెంటనే స్పందించి కాంట్రాక్టర్కు ఫోన్ ద్వారా కొలతలు అయిపోయిన తర్వాత ఫినిషింగ్ కంచె నిర్మించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ మురళీధర, రైతులు సాగర్ రెడ్డి రామాంజనేయులు తదితర రైతులు పాల్గొన్నారు.

# స్టోర్ డీలర్లు తప్పకుండా తూకం యంత్రాలకు సీల్ వేయించుకోవాలి

**- సీల్ లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం**

**తూనికలు, కొలతల శాఖ**



**పామిడి - సూర్య వాస్తవం :** వ్యాపారంలో మోసాలు జరగకుండా ఉండటానికి ప్రతి తూకం యంత్రాన్ని కచ్చితంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం సీల్ వేయించుకోవాలని తూనికల కొలతల శాఖ అధికారులు తెలిపారు. పామిడి తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ప్రభుత్వ చౌక ధాన్యపు సరఫరాదుకాణం డీలర్లు సరుకుల తూకంలో లబ్ధిదారులకు మోసాలు జరిగితే చర్యలు తప్పవని తూనికలు కొలతలశాఖ ఇన్స్పెక్టర్ వైజి శంకర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని నిర్ణీత కాలపరిమితి పూర్తయిన 50 ప్రభుత్వ రేషన్ షాపుల ఎలక్ట్రానిక్ మిషన్ల కాటాలకు ముద్రలు (షీల్)వేసి ఆన్లైన్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ సందర్భంగా తూనికల కొలతల ఇన్స్పెక్టర్ వైజి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ రేషన్ షాపులలో సరుకుల తూకంలో వినియోగదారులను మోసం చేసిన,నిర్ధారించిన ధరల కంటే అధిక ధరలు వసూలు చేసిన కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తూనికల కొలతలశాఖ సిబ్బంది డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# కవి కోకిల గుర్రం జాషువా 55వ వర్ధంతి



**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి పట్టణంలోని ఫుట్బాల్ గ్రౌండ్లో పెన్షనర్స్ అసోసియే షన్ ప్రెసిడెంట్ అబూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయి బాబు ఆధ్వర్యంలో గుర్రం జాషువా 55 వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గుర్రం జాషువా చిత్ర పటా నికి కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు పూల మాల వేసి నివాళు లర్పించారు.వక్తలు మాట్లాడుతూ గుర్రం జాషు వా నవయుగ కవి చక్రవర్తి, దళిత వర్గ జ్వల నూర్పివీ రికి జాషువా అని కూడా అంటారు.వీరి తల్లి తండ్రు లు వేరు వేరు కులాలకు చెందిన వారు.చదువు కో సం బడిలో చేరిన తరువా త చాలా కష్టాలు పడ్డాడు. అయితే కవిత్వం ఆయుధం గా చేసుకుని మూడా చారా లపై తిరగ బడ్డాడు జాషువా అని కోశాధికారి జెన్నే కుల్లా యిబాబు తెలిపారు.ఈ కా ర్యక్రమంలో ప్రెసిడెంట్ అ బూబాకర్, కోశాధికారి జెన్నే కుల్లాయిబాబు, వెంకటేష్ విజయ లక్ష్మి,లక్ష్మీ నారాయణ రెడ్డి, హస్సన్ అహమ్మద్, గోవిందప్ప, నారాయణ శెట్టి, వేణుగోపాల్, నరసింహులు, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**పామిడి -సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని రుక్మిణి సమేత పాండురంగ స్వామి ఆలయాలలో శుక్రవారం ఆషాడ మాస బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. జ్ఞానేశ్వరి(జ్ఞానేశ్వర మహారాజ్ విరచిత భగవద్గీత పోతి )గ్రంధాన్ని నూతన వస్త్రంలోఉంచి మురళీ ఇంటి నుండీ డబ్బిదార్ ఫిర్కా ఆలయంకు, టి కె జగదీష్ ఇంటి నుండి రంగసుభే ఫిర్కా ఆలయంకు ఊరేగింపుగా బావసార క్షత్రియులు భక్తిశ్రద్ధలతో నిష్టాగరిష్టలై భజనలతో తీసుకెళ్లి ప్రతిష్టించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కార్యవర్గకమిటీ, యువజన కమిటీ, భజన బృందం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# ‘తల్లికి వందనం’ ప్రతి విద్యార్థికి చేయూత

**- మెగా పేరెంట్-టీచర్ మీట్‌లో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్**



**వజ్రకరూరు - సూర్య వాస్తవం:** విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ కార్యక్రమం లో పాల్గొనడానికి వచ్చిన ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్‌కి మండల నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు.అక్కడ నుండి ర్యాలీగా బయలుదేరి వజ్రకరూరు మండల కేంద్రంలోని కాటా వెంకటప్ప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

మంత్రి పయ్యావుల కేశవ్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆత్మీయంగా ముచ్చటించి విద్యార్థుల విద్యా పురోగతి, పాఠశాల అభివృద్ధి, మధ్యాహ్న భోజన పథకం అమలు, భోజనం నాణ్యతపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.ఈ సందర్భంగా తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి రూ.15,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నందుకు తల్లిదండ్రులు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యా సంస్కరణలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై తమ సంతృప్తిని వ్యక్తం చేశారు.ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకు పేదరికం అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక సంక్షేమ, విద్యా కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఆధునిక మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చుతూ “తల్లికి వందనం” పథకం ద్వారా కుటుంబంలోని ప్రతి విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. అలాగే, పిల్లల విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు నిరంతరం శ్రద్ధ చూపుతూ ఉపాధ్యాయులతో తరచూ సంప్రదించి వారి పురోగతిని తెలుసుకోవాలని సూచించారు.

# కార్పొరేట్ స్కూల్స్‌ని తలపించేలా ప్రభుత్వ బడులు

**- విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనం..: ఎమ్మెల్యే దగ్గుపాటి**

**- శారదా మున్సిపల్ బాలకల ఉన్నత పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమం**

**- విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆటల పోటీలు, సహపంక్తి భోజనం**

**- విద్యా వ్యవస్థను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారన్న ఎమ్మెల్యే**

**- తల్లికి వందనంతో ప్రతి విద్యార్థి ఇంట ఆనందం కనిపిస్తోందన్న ఎమ్మెల్యే**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** కార్పొరేట్ స్కూల్స్‌ని తలపించేలా ప్రభుత్వ బడులు కనిపిస్తున్నాయని.. విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనమని.. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని శారదా మున్సిపల్ బాలకల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఇఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావులు ఎంఈవో, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు చేశారు. పాఠశాలను మొత్తం పరిశీలించారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో విద్యాబోధన, సౌకర్యాలు, తల్లికి వందనం పథకాల గురించి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరా తీశారు. పాఠశాలల్లో సౌకర్యాలపై తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఆటల పోటీల్లో పాల్గొంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఉత్సాహంగా కనిపించారు. విద్యార్థుల వైపు ఎమ్మెల్యే, ఇంకో వైపు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పోటా పోటీగా టగ్ ఆఫ్ వార్ అన్నారు. విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ పేరెంట్స్ మీటింగ్ అంటే కార్పొరేట్ బడుల్లోనే చూసే వారమని.. కానీ నేడుప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటివి నిర్వహిస్తున్నారన్నారు. గతంలో పిల్లల పుస్తకాలు, బెల్టులపై కూడా జగన్ బొమ్మలు కనిపించేవని.. ఉపాధ్యాయులను వైన్ షాపులు, బాత్ రూంల వద్ద ఉంచి.. విద్యా వ్యవస్థను జగన్ రెడ్డి భ్రష్టు పట్టించారన్నారు. అలాంటి శాఖను మంత్రి నారా లోకేష్ తీసుకుని ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. ఏ పాఠశాలలో చూసిన పండుగ వాతవారణం కనిపిస్తోందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరుతున్నారన్నారు. ఇంట్లో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం 15వేలు చొప్పున అందజేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రంలో 67లక్షల మందికి పైగా విద్యార్థులకు రూ.10120కోట్లు అందజేశారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 49,489 విద్యార్థులకు 65కోట్ల రూపాయలు అందిందన్నారు. ఒకే ఇంట్లో నలుగురు పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం అందిందని.. ఈ రోజు ప్రతి విద్యార్థి ఇంటా పండుగ వాతావరణం కనిపిస్తోందన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గ తరుపున సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, టిడిపి నాయకులు చరిత, దలవాయి రమాదేవి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పి ఎల్ ఎన్ మూర్తి, ఎంఈవోలు వెంకటస్వామి, సరితా రాణి, శివాలయం ఆలయం కమిటీ చైర్మన్ నరేంద్ర చౌదరి, పాఠశాల హెచ్‌ఎం సుష్మలత, పేరెంట్స్ కమిటీ చైర్మన్ మీనాక్షి, త్రీ టౌన్ సిఐ కౌలుట్లయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు

**- ఘనంగా మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్ 4.0**

**- ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఎమ్మెల్యే శ్రావణి శ్రీ**



**శింగనమల - సూర్య వాస్తవం:** బుక్కరాయసముద్రం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ 4.0లో భాగంగా చేపట్టిన “పిల్లల బంగారు భవిష్యత్తు కోసం బడివైపు ఒక అడుగు” కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జిల్లా అధ్యక్షులు పూల నాగరాజుతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన లైబ్రరీ, స్పోర్ట్స్, వొకేషనల్, స్టెమ్ ల్యాబ్, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ స్టాళ్లను సందర్శించారు. విద్యార్థుల ప్రతిభ, సృజనాత్మకతను అభినందిస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న ఆధునిక సౌకర్యాలు విద్యారంగంలో వస్తున్న సానుకూల మార్పులకు నిదర్శనమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు విద్యాసంస్థలకు ధీటుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం విద్యారంగంలో పలు సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన సన్నబియ్యంతో భోజనం, తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఒక్కో విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సహాయం, సర్వేపల్లి రాధాకృష్ణ కిట్స్ ద్వారా నాణ్యమైన యూనిఫాంలు, విద్యా సామగ్రి అందిస్తున్నట్లు తెలిపారు.విద్యా వ్యవస్థను మరింత ఆధునీకరించేందుకు ప్రభుత్వం లీప్ యాప్ను ప్రవేశ పెట్టిందని, విద్యార్థుల హాజరు సహా ఇతర వివరాలను ఈ యాప్‌లో నమోదు చేయడం ద్వారా తల్లిదండ్రులకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ



కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల కమిటీ చైర్మన్ లింగమయ్య, పూర్వ విద్యార్థులు లక్ష్మీనారాయణ, రామలింగారెడ్డి, రవీంద్ర, శ్రీరామ్ రెడ్డి, మండల సింగిల్ విండో అధ్యక్షులు కేసన్న, ఎంపీపీ సునీత, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శైలజ, నాయ కులు శ్రీధర్ బాబు, జి.సి. బాబు తదితరులు పాల్గొన్నారు.

# చిన్ననాటి స్నేహితుల సేవా స్ఫూర్తి....!

- ప్రభుత్వ పాఠశాలకు డిస్కవర్ అనంతపురం అనిల్ ఫర్నిచర్ విరాళం
- నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి నిరంతర సేవలు అందిస్తున్న దాతలు
- ప్రజల భాగస్వామ్యంతోనే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలోపేతం: ఏ.జి. అనిల్ కుమార్
- "కృత్రిమ గూళ్లతో పిచ్చుకలకు ఆశ్రయం
- ప్రకృతి పరిరక్షణలో పాఠశాల



**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమాజం చేయూతనందించాలనే సంకల్పంతో చిన్ననాటి స్నేహితులు టి.ఎన్. కిషోర్, డిస్కవర్ అనంతపురం వ్యవస్థాపకుడు ఏ.జి. అనిల్ కుమార్ ఆధ్వర్యంలో, ఏజీఎస్ ఫౌండేషన్ సహకారంతో ఎంజేపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఫర్ గర్ల్స్, నార్పలలో చదువుతున్న 120 మంది విద్యార్థినులకు తరగతి గది ఫర్నిచర్‌ను అందజేశారు.పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ సమావేశంలో ఏ.జి. అనిల్ కుమార్ మరియు ఏ.జి. ప్రమీలమ్మ పాఠశాల యాజమాన్యానికి ఫర్నిచర్‌ను అందించారు. దీంతో ఇప్పటివరకు నేలపై కూర్చొని చదువుతున్న విద్యార్థినులు ఇకపై డెస్కులు, బెంచీలపై సౌకర్యవంతంగా విద్యాభ్యాసం కొనసాగించను న్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆనందం వ్యక్తం చేయగా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది దాతలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఏ.జి. అనిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడు ప్రభుత్వ విద్యాభివృద్ధికి తనవంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా బాలికల విద్యకు సహకరించడం దేశ భవిష్యత్తుకు పెట్టుబడిగా భావించాలని అన్నారు. గత నాలుగేళ్లుగా డిస్కవర్ అనంతపురం మరియు ఏజీఎస్ ఫౌండేషన్ ఈ పాఠశాలకు గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, ఫర్నిచర్, ల్యాప్‌టాప్‌ల పంపిణీ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాయని తెలిపారు.



**"కృత్రిమ గూళ్లతో పిచ్చుకలకు ఆశ్రయం – ప్రకృతి పరిరక్షణలో పాఠశాల**

అలాగే పాఠశాలను పక్షుల నిలయంగా తీర్చిదిద్దేందుకు వందలాది కృత్రిమ గూళ్లను ఏర్పాటు చేయగా, ప్రస్తుతం పాఠశాల ప్రాంగణంలో 400కు పైగా పిచ్చుకలు పెరిగి ప్రకృతి–విద్య సమన్వయానికి ఈ పాఠశాల ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, మరింత మంది దాతలు, స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వ పాఠశాలలకు చేయూత అందించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థినులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు టి.ఎన్. కిషోర్, డిస్కవర్ అనంతపురం, ఏజీఎస్ ఫౌండేషన్ సేవలను అభినందించారు.

# మాకు ఇల్లు కేటాయించండి...

- ఉమానగర్ పాత 14 వ డివిజన్ వాసులు వేడుకోలు
- అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్‌కు లబ్ధిదారుల వినతి
- హైకోర్టు ఉత్తర్వులు అమలు చేసి ప్లాట్లు అప్పగించాలని వినతి
- 374 మంది లబ్ధిదారులకు న్యాయం చేయాలి
- పట్టించుకోని తహశీల్దార్...!





**అనంతపురం టౌన్ – సూర్య వాస్తవం :** ఉప్పరపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెం. 64–2 (రీ సర్వే నెం. 147–2), సర్వే నెం. 51–2 (రీ సర్వే నెం. 146–2)లో అనంతపురం ఉమా నగర్ అప్పటి పాత 14 వ డివిజన్ వాసులు తమకు కేటాయించిన ప్లాట్లకు ఇప్పటివరకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు కేటాయించిన స్థలాలను ఎలాంటి న్యాయ ప్రక్రియ లేకుండా ఇతరులకు కేటాయించే ప్రయత్నం జరిగిందని, దీనిపై అధికారులు స్పందించకపోవడంతో ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. డబ్ల్యు.పి. నెం. 5214/2020లో హైకోర్టు 30–12–2020న మధ్యంతర ఉత్తర్వులు, అనంతరం 08–09–2021న తుది ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ, వాటిని అమలు చేయడం లేదని ఆరోపించారు. 2017--18, 2018--19లో ఎన్టీఆర్ గృహాల పథకం, ప్రధాని ఆవాస్ యోజన కింద 374 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం కోసం ఈ ప్లాట్లు కేటాయించారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఆ స్థలాల్లో గుడి, రాళ్లు, బండలు ఏర్పాటు చేసి ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని, వాటిని వెంటనే తొలగించి హైకోర్టు ఆదేశాల మేరకు తమకు ప్లాట్లను అప్పగించి గృహ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. మొత్తం 374 మంది లబ్ధిదారులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసు కోవాలని కమిషనర్‌ను వారు విజ్ఞప్తి చేశారు.

# బాలిక కిడ్నాప్ కేసును ఛేదించిన రాప్తాడు పోలీసులు

- మైనర్ బాలిక సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగింత
- ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్



**అనంతపురం రూరల్– సూర్య వాస్తవం :** రాప్తాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ నెల 10న ఓ పాఠశాల సమీపంలో జరిగిన మైనర్ బాలిక కిడ్నాప్ కేసును రాప్తాడు పోలీసులు వేగంగా ఛేదించారు. సి.ఐ. వెంకటేశులు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టి బాలికను సురక్షితంగా రక్షించడంతో పాటు ప్రధాన నిందితుడితో పాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అనంతపురం రూరల్ మండలం నరసనయనకుంట తండాకు చెందిన బి. మహేంద్ర నాయక్ ఈ నెల 10న పాఠశాల వద్ద నుంచి మైనర్ బాలికను కిడ్నాప్ చేశాడు. ఈ నేరంలో అతనికి సహకరించి ఆశ్రయం కల్పించిన ఆత్మకూరు మండలం సింగంపల్లి తండాకు చెందిన (ప్రస్తుతం కొవ్వూరు నగర్ నివాసి) వార్తే వంశీ నాయక్ (20), శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలం భానుకోట గ్రామానికి చెందిన హరిజన కార్తీక్ (23)లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం బాధిత బాలికను సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రుల చెంతకు చేర్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు సి.ఐ. వెంకటే శులు వెల్లడించారు. పోలీసుల వేగవంతమైన దర్యాప్తుతో కేసు స్వల్ప కాలంలోనే ఛేదిం చబడటంతో బాధిత కుటుంబ సభ్యులు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఉరవకొండ పారిశ్రామికాభివృద్ధికి వేగంగా అడుగులు

- ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు మంత్రి పయ్యావుల కేశవ్ కసరత్తు
- పెట్టుబడులకు సిద్ధమవుతున్న ఉరవకొండ...
పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన
- స్థానిక యువతకు ఉపాధే లక్ష్యం..

**ఉరవకొండ – సూర్య వాస్తవం :** నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ చర్యలను వేగవంతం చేశారు. శుక్రవారం ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూములను సంబంధిత అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. మ్యాపుల ఆధారంగా ప్రభుత్వ భూముల వివరాలను సమగ్రంగా పరిశీలిస్తూ, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన ప్రాంతాలను గుర్తించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఉరవకొండను పెట్టుబడులకు అనుకూలమైన పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. భారీ పరిశ్రమలను ఆకర్షించే దిశగా భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని, 50 నుంచి 100 ఎకరాల వరకు ఒకేచోట అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు సొంత ప్రాంతంలోనే ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ఉరవకొండ ఆర్థికాభివృద్ధికి కొత్త ఊతం ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అభివృద్ధి, ఉపాధి, పెట్టుబడులే ప్రభుత్వ ప్రాధాన్య లక్ష్యాలని ఆయన పేర్కొన్నారు.

# టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా 4.0 మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్

**పామిడి– సూర్య వాస్తవం :** స్థానిక పామిడి టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పామిడిలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్ కుమార్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక సంక్షేమశాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్ పాల్గొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి, విద్యార్థులు ప్రగతిపై తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వ హించారు. తదుపరి జరిగిన సమావేశం నందు అధ్యక్షులు మరియు అతిథులు ప్రసంగిస్తూ ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న సౌకర్యాలు సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రామ్ కుమార్, వెంకటశివయాదవ్, పట్రా శ్రీనివాసులు, ప్రభాకరచౌదరి, ఆర్మీ మేజర్ లక్ష్మీనారాయణ, రామాంజి, హరిత, నరసూల్,ఉపాధ్యాయబృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు,పాఠశాల పూర్వ విద్యార్థులు, ఎస్ఎంసి సభ్యులు, స్థానిక నాయకులు, పాఠశాల దాతలు పాల్గొన్నారు. చివరగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని అందరూ స్వీకరించారు. కార్యక్రమం వైభవోపేతంగా సమరోత్సహంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది.



# తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీవో ప్రభాకర్, ఎంఈఓ జయనాయక్




**పామిడి – సూర్య వాస్తవం:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ప్రభాకర్ మండల విద్యశాఖ అధికారి జయా నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పిల్లల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వారి ప్రతిభను వెలికితీయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, సాంకేతిక బోధన అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రభుత్వం లక్ష్యం ప్రతి విద్యార్థిని ఉన్నత స్థాయికి చేర్చడమేనని పేర్కొన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.మెగా పేరెంట్--టీచర్ మీటింగ్‌లు విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా,తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల మధ్య మరింత సత్సంబంధాలను పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. పిల్లల చదువుపై ప్రతి తల్లిదండ్రి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్,విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ విజయవంతం



**గుత్తి – సూర్య వాస్తవం :** గుత్తి గాంధీ సర్కిల్ నందు కేంద్ర వి ద్యా శాఖ మంత్రి దిష్టిబొమ్మ దగ్ధం ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు సి రమేష్,ఏఐ ఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్ నాయక్, ఎస్ఎఫ్ఐ గుత్తి మండల కార్యదర్శి నవీన్ యాదవ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష ఆన్లైన్లో నిర్వహించాలి నీట్ పరీక్ష నిర్వహణలో రాష్ట్రాల హక్కులు కల్పించాలి. శనివారం విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బంద్‌లో భాగంగా గుత్తి మండలం వ్యాప్తంగా జరిగిన బంద్‌లో విద్యార్థి సంఘా లు పాల్గొన్నారు. ప్రవేట్ పాఠశాలలో కళాశాలలో స్వచ్ఛందంగా బందులో పాల్గొన్నారు.నీట్ పేపర్ లీకేజీకి వ్య తిరేకిస్తూ జరిగే బంద్‌ను స్వచ్ఛందంగా ప్రైవేట్ విద్యాసంస్థలు బంద్ ప్రకటిస్తే ప్రభుత్వ విద్యాసంస్థలు మాత్రం పోలీసులను కాపలా పెట్టుకుని.బంద్ ను అడ్డుకోవడం దుర్మా ర్గం. విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛం దంగా బంద్ ప్రకటించాల్సింది పో యి బిజేపీకి వత్తాసు పలుకుతున్న రాష్ట్ర ప్రభుత్వం రానున్న స్థానిక ఎ న్నికలో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తాం. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, వం శి, ధన, రాజేష్, చంద్రశేఖర్, నాయక్, వలి,అఖిల్, ఏఐఎస్ఎఫ్ నాయకులు, వంశి, షరీఫ్, రఫీ, తేజ, విక్కి, తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధిపై కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన సమీక్ష ..

- ఫార్మసీని తనిఖీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



**అనంతపురం వైద్యం – సూర్య వాస్తవం :** అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధి, రోగులకు మెరుగైన వైద్య సేవల అందింపుపై జిల్లా కలెక్టర్ ఆనంద్ అధ్యక్షతన ఆసుపత్రి సెమినార్ హాల్‌లో నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఆసుపత్రిలోని ఫార్మసీని తనిఖీ చేసి, మందుల నిల్వలు, పంపిణీ విధానం, రోగులకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులకు నాణ్యమైన సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచించారు.

# రైతుల పక్షపాతి... టీడీపీ ప్రభుత్వం

- వై.నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంఎస్ చైర్మన్
జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు



**ప్యాపిలి- సూర్య వాస్తవం:** ప్యాపిలి మండలంలోని మెట్టుపల్లి గ్రామంలో డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు ఉచిత యూరియా, వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి అగ్రికల్చర్ ఏడి, ఎండిఓ ఎమ్మార్వో సీఐ, మార్కెట్ యార్డ్ చైర్మన్ రేణుకమ్మ, మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి మెట్టుపల్లి సుదర్శన్ మొదలైన నాయకులు రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, డ్రిప్ ఇరిగేషన్ను ఉపయోగించుకోవడం, రైతులు పండించిన పంటకు ఇన్సూరెన్స్ చేయించడం, డి ఏ పి యాప్ ద్వారా రైతులు పండించుకునే పంటను బట్టి ఎకరాకు ఎన్ని బస్తాలు అని నిర్ణయించి రైతులకు పంపిణి చేయడం జరుగుతుంది.రైతులు వ్యవసాయంలో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలను సమయానికి అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, డోన్ నియోజకవర్గం లో ప్రతి రైతు అభివృద్ధి చెందాలన్నదే తమ లక్ష్యమని, రైతుల ఆదాయం పెరిగేలా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి




**బేతంచర్ల - సూర్య వాస్తవం:** బేతంచర్ల సమీపంలోని ఎం.జే.పీ.ఏ.పీ. బాలుర పాఠశాల మరియు జూనియర్ కళాశాల, గోరుమానుకొండలో నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ కార్యక్రమానికి డోన్ శాసనసభ్యులు శ్రీ కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. పిల్లల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, వారి ప్రతిభను వెలికితీయడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక మౌలిక వసతులు, సాంకేతిక బోధన అందుబాటులోకి తీసుకొస్తున్న ప్రభుత్వం లక్ష్యం ప్రతి విద్యార్థిని ఉన్నత స్థాయికి చేర్చడమేనని పేర్కొన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.మెగా పేరెంట్--టీచర్ మీటింగ్‌లు విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరచడమే కాకుండా, తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల మధ్య మరింత సత్సంబంధాలను పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. పిల్లల చదువుపై ప్రతి తల్లిదండ్రి ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చి దిద్దేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరిన ఎమ్మెల్యే, విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న సీడ్స్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

**డోన్ - సూర్య వాస్తవం:** స్థానిక మండల పరిధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పీటీమ్) 4.0 కార్యక్రమంలో భాగంగా పట్టణంలో , పాతపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి హాజరయ్యారు. విద్యతో దేనినైనా సాధించవచ్చు అని పిల్లలకు తెలియజేశాడు. అదేవిధంగా 10వ తరగతి పరిక్షలలో ఫలితాల్లో ఆ స్కూల్ ప్రధమ వచ్చిన విద్యార్థికి రూ.25,000 ద్వితీయ విద్యార్థికి రూ.15,000 తృతీయ వచ్చిన విద్యార్థికి రూ.10,000 రూపాయలు ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి తన సొంత నిధితో నగదు బహుమతి అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు..!

- విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనం.. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్
- ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ కర్నూలు పాఠశాలలో మెగా పీటీఎం కార్యక్రమం
- ప్రిన్సిపల్ అరుణ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆటల పోటీలు, సహపంక్తి భోజనం
- పూర్వ విద్యార్థులకు సన్మానం.... పోటీలలో గెలిచిన విద్యార్థుల తల్లులకు బహుమతులు ప్రదానం



**కర్నూలు - సూర్య వాస్తవం :** కార్పొరేట్ స్కూల్స్‌ని తలపించేలా ప్రభుత్వ బడులు కనిపిస్తున్నా యని.. విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనమని.. విద్యా వ్యవస్థలో మార్పులకు ఇదే నిదర్శనం.. జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్ అన్నారు. కర్నూలు నగరంలోని బి క్యాంప్ లోని ఏపీ టీ డబ్ల్యూ ఆర్ ఎస్ కర్నూలు బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సురేష్‌కు స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు తమ తల్లి దండ్రు లకు పాదాభివందనం చేశారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలలో విద్యాబోధన, పాఠశాలల్లో సౌకర్యాలపై తల్లి దండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి ఆటల పోటీల్లో పాల్గొంటూ ఉత్సా హంగా కనిపించారు. అనంతరం గత సంవత్సరం టాపర్ గా నిలిచిన ముగ్గురు విద్యా ర్థులకు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపల్ అరుణ, వార్డెన్ లతో కలిసి విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించారు. పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అరుణ మాట్లాడుతూ..... పేరెంట్స్ మీటింగ్ అంటే కార్పొరేట్ బడుల్లోనే చూసే వారమని.. కానీ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో ఇలాంటివి నిర్వహిస్తున్నా రన్నారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు అధ్యాపకులు సలోమి. హేమలత, జువేరియా, కుసుమ, రేణుక, హరిత తదితరులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ కళాశాలలో ఘనంగా మెగా పిటియం 4.0





**తనకల్లు - సూర్య వాస్తవం:**

ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్--టీచర్ మీటింగ్ పీటీమ్ 4.0) కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సబ్ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు చక్కటి సందేశాన్ని అందించారు, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపక బృందం తల్లిదండ్రుల సమావేశం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు భాస్కర్, చక్కటి సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం విద్యార్థుల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పలు సంక్షేమ కార్యక్రమాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించామ న్నారు. ముఖ్యంగా "తల్లికి వందనం" పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంపై వివరించడం జరిగింది. విద్యార్థులకు అందజే స్తున్న ఉచిత స్కూల్ బ్యాగులు, షూస్, యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంలో తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమన్వయం అత్యంత కీలకమని వివరించారు. పిల్లలకు కేవలం విద్య మాత్రమే కాకుండా మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, పెద్దల పట్ల గౌరవం, దేశభక్తి మంచి పౌరులుగా ఎదిగే లక్షణాలు చిన్నప్పటి నుంచే అలవర్చాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే పేరెంట్స్ -- టీచర్స్ పరస్పర సహకారం, నిరంతర సంభాషణ, బాధ్యతాయు తమైన భాగస్వామ్యం అవసరం అని తెలియజేశారు.

**మన పిల్లల భవిష్యత్తు -- మన అందరి బాధ్యత.**

నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలను అందించి ఆదర్శ పౌరులుగా తీర్చిదిద్దడం ప్రతి ఒక్కరి కర్తవ్యం.ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బాలికల పాఠశాలలో ఘనంగా మెగా పిటిఎం-4 కార్యక్రమం




**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి పట్టణం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి కొ ణిదెల పవన్ కళ్యాణ్, విద్యుత్ శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమంతట మెగా పేరెంట్స్ మీటింగ్ 2.0 కార్య క్రమం నిర్వహణకు శ్రీకారం చుట్టా రు.అందులో భాగంగా గుత్తి మున్సి పల్ కమిషనర్ బి.జబ్బార్ మియా, స్థానిక కర్నూల్ రోడ్డులో ఉన్న బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థు లు అందరూ తమ తల్లిదండ్రులు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకుని వచ్చే పిల్లలు గా ఎదగాలని భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉంటే మొట్ట మొదటిసారిగా గర్వపడేది తల్లిదండ్రులు మీకు పాటలు చెప్పిన విద్యార్థులేనని మ రియు ఉపాధ్యాలు పాఠాలు చెప్పే సమయంలో శ్రద్ధగా ఏకాగ్రాతతో వినాలని తెలిపారు. ప్రస్తుతం సమా జంలో ఇతరత్రా చదువుకు సంబం ధంలేని విషయాలపై దృష్టి పెట్టకుం డా విద్యార్థి దశలో ఎంత శ్రద్ధగా చదువుకుంటే అంత మంచి స్థాయిలో ఉంటారని పిల్లల భవిష్యత్తు గురించి సూచనలు ఇచ్చారు. సమావేశం అనంతరం తల్లి తండ్రులకు క్రీడా పో టీలను నిర్వహించి మానసిక ఉల్లా స కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుంకన్న ఉపాధ్యాయులు విద్యా కమిటీ చైర్మన్‌లు, సభ్యులు, టిడిపి నాయకులు, బి.జె.పి నాయకులు, జన సేన నాయకులు, వివిధ సామాజిక సంస్థల ప్రముఖులు, విద్యార్థిని విద్యా ర్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# నూరి ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం :** ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డు మట్టి మసీద్ వీధి లో ఉన్న ఉర్దూ ఎలిమెంటరీ స్కూల్‌లో ప్రధాన ఉపాధ్యాయురాలు ఆధ్వర్యంలో శుక్రవారం తల్లితండ్రులు -ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశము ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధి గా టిడిపి మైనార్టీ నాయకులు, 25 వ వార్డు ఇన్చార్జి నూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన తల్లికి వందనం పథకం ఏవిధంగా పిల్లల చదువు కు ఆర్థికంగా ఉపయోగ పడుతుందని విద్యార్థుల తల్లితండ్రులను అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం ద్వారా ఎలాంటి ఇబ్బందులు పడకుండా తమ పిల్లలు అందరిని చదువు కునేందుకు అవకాశం కల్పించిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, విద్యాశాఖ మంత్రి లోకేష్ కి విద్యార్థుల తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా ఏర్పాటు చేసిన ఆటలపోటీలలో గెలుపొందిన విద్యార్థుల తల్లితండ్రులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘చెన్నై లవ్‌స్టోరీ’ మూవీ రివ్యూ



ఇప్పటి వరకు ఎన్నో ప్రేమకథలు వెండితెరపై ఆవిష్కరించబడ్డాయి. ఈ ప్రేమకథలను కొత్తగా ప్రజెంట్ చేయగలిగితే ప్రేక్షకులు ఆదరిస్తారు అనే నమ్మకంతో దర్శకులు సరికొత్త ప్రేమకథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ కోవలోనే ‘బేబీ’ సినిమాతో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా జాతీయ అవార్డును అందుకున్న సాయిరాజేష్ తన కథతో, ఎస్‌కేఎన్‌తో కలిసి నిర్మించిన చిత్రం ‘చెన్నై లవ్‌స్టోరీ’. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. ఈ చిత్రం ప్రచారంలో ముందు నుంచే ఇదొక కల్ట్ బ్లాక్‌బస్టర్ అనే ట్యాగ్‌ను యాడ్ చేసిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించిందా? ఈ ప్రేమకథలో అందరి హృదయాలను హత్తుకునే అంశాలున్నాయా? లేదా? అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం...


నివి (శ్రీ గౌరి ప్రియ) మూడేళ్లుగా ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)ని పెళ్లి చేసుకోని అందమైన జీవితాన్ని గడపాలని ఊహించుకుంటుంది. కానీ పెళ్లి ముహూర్త సమయానికి అజయ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని, తాను మరో అమ్మాయిని ఇష్టపడుతున్నానని, నివికి బ్రేకప్ చెప్పి బెంగళూరు వెళ్లిపోతాడు. ఈ సంఘటనతో షాక్‌లో ఉన్న ఆమె మనసు ముక్కలైపోతుంది. ఈ బాధని మరిచిపోవడానికి తన స్నేహితులతో కలిసి చెన్నై వెళ్లిపోతుంది. ఊరు మారినా తన మనసు మారదు. విఫలప్రేమ బాధ నుంచి బయటపడటానికి ఆల్కహాల్‌కు అలవాటుపడుతుంది.

ఈ సమయంలోనే సినిమా రంగంలో దర్శకత్వ అవకాశం కోసం వేచి చూస్తున్న అనాథ స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) నివి స్నేహితులు ఉండే ఇంట్లోనే ఆశ్రయం సంపాందిస్తాడు. ఆ ఇంట్లో అందరితో సరదాగా ఉండే స్టీవెన్ పనులు మాత్రం నివికి విసుగు తెప్పిస్తాయి. స్టీవెన్ విషయంలో తన ప్రవర్తన కరెక్ట్ కాదని తెలుసుకున్న తను క్రమంగా అతడ్ని ఇష్టం పడటం మొదలుపెడుతుంది. స్టీవెన్ మాత్రం ఆమెను ఓ దేవతలా ఆరాధిస్తుంటాడు. ఓ రోజు సడన్‌గా ‘మనం పెళ్లి చేసుకుందామా’ అని అడుగుతుంది. అప్పుడు స్టీవెన్ ఏం చేశాడు? వీళ్ల ప్రేమకథ సక్సెస్ అవుతుందా? పెళ్లిపీటల మీద పెళ్లిని కాదని వెళ్లిపోయిన అజయ్ మళ్లీ నివి జీవితంలోకి ఎందుకొచ్చాడు? స్టీవెన్ శంకర్‌కు దర్శకత్వ చాన్స్ వచ్చిందా? నివి ఎవరిని పెళ్లి చేసుకుంది అనేది మిగతా కథ. “ప్రతి ప్రేమకథ ఒకేలా ఉంటే చరిత్రకు కూడా నచ్చదండీ” అనే ఓ డైలాగ్ ఈ చిత్రంలో ఉంటుంది. అందుకే ఈ చిత్ర కథా రచయిత ఈ ప్రేమకథను చాలా కొత్తగా ఆలోచించాడు. “తొలిప్రేమ ఎప్పటికీ మధుర జ్ఞాపకమే. అది మనసు పొరల్లో శాశ్వతంగా ఉండిపోతుంది” అంటూ ‘బేబీ’తో హృదయానికి హత్తుకునే ప్రేమకథను చెప్పిన.. దర్శకుడు సాయి రాజేష్.. ఈసారి తొలి ప్రేమ తోపు కాదు అంటూ మరో వినూత్న ప్రేమకథను ‘చెన్నై లవ్‌స్టోరీ’తో అందించాడు. ఫస్టాఫ్‌లో వచ్చే గుర్తుందా పాట అలరిస్తుంది. ఇక ఇంటర్వెల్‌కు సమయానికి కథ షాకింగ్ టర్న్ తీసుకుంటుంది. ఈ సీక్వెన్స్ చూశాక దర్శకుడు సెకండాఫ్‌ను ఎలా డీల్ చేస్తాడా? అనే ఆసక్తి అందరిలో మొదలవుతుంది. అయితే దర్శకుడు ముందే ఇచ్చిన హింట్స్ ప్రకారం దాదాపు అందరూ ద్వితీయార్ధాన్ని ఊహించుకుంటూనే సెకండాఫ్‌లోకి ఎంట్రీ అవుతారు. డైరెక్టర్‌కి ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది. తన కన్వీనెంట్‌గా సన్నివేశాలు రాసుకుని, కొత్తదనం కోసం ప్రయత్నించినా అది కన్విన్సింగ్‌గా అనిపించదు. తాను సెకండాఫ్‌లో చెప్పాలనుకున్న విషయాన్ని ఫస్టాఫ్‌లో కొన్ని సన్నివేశాలతో దర్శకుడు రిజిష్టర్ చేసే ప్రయత్నం చేసి ఆడియన్స్‌ను ప్రీపేర్ చేసిన భావన కలుగుతుంది. అందరూ ఊహించునట్టుగానే సెకండాఫ్‌లో ఈ లవ్‌స్టోరీ కాస్త తడబడింది.. అయితే కొన్ని హార్ట్ టచ్చింగ్ సీన్స్‌తో దర్శకుడు కథను ఎక్కడ పడిపోతున్న ఫీల్ కలగకుండా మేనేజ్ చేశాడు. ఈ సినిమా ద్వితీయార్ధం చూస్తున్నప్పుడు కొన్ని ఆల్రెడీ చూసిన సినిమాలు గుర్తుకొచ్చినా.. మరో బలమైన సన్నివేశంతో ఆ భావనను ఆడియన్స్ మైండ్‌లో నుంచి తుడిచిపెట్టే విధంగా దర్శకుడు సెకండాఫ్‌ని హ్యాండిల్ చేశాడు. ద్వితీయార్ధంలో కుక్కల ఫైటింగ్.. స్మశానంలో హీరోయిన్ సీన్, పతాక సన్నివేశాలు కీలకంగా నిలిచాయి. అయితే సెకండాఫ్‌ను రచనా పరంగా మరింత బలంగా రాసుకుని ఉంటే కథనం ప్రేక్షకుల ఊహకు అందకుండా థ్రిల్ల్‌ను కలిగించేంది.

ఈ సినిమాకు కిరణ్ అబ్బవరం నటన బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. స్టీవెన్ శంకర్‌గా ఆయన పర్‌ఫార్మెన్స్‌లో మెచ్యూరిటి కనిపించింది. ఎంతో నేచురల్‌గా ఆ పాత్రలో ఒదిగిపోయాడు. ఈ సినిమాతో నటుడిగా ఆయన మరో మెట్టు ఎక్కాడు. నివి పాత్రలో గౌరీప్రియ అలరించింది. ఓ కథానాయికకు ఇలాంటి పాత్ర లభించడం చాలా అరుదు. ఆమె తన పాత్రకు పర్‌ఫెక్ట్ చాయిస్ అనిపించింది. లవ్‌ఫెయిల్యూర్ అమ్మాయిలా ఆమెలోని భావోద్వేగపూరిత నటన అందరి హృదయాలను హత్తుకుంటుంది. త్రిగుణ్ కూడా తన పాత్రకు న్యాయం చేశాడు.

స్నేహితులుగా సిరి హనుమంతు, పూజ, నవీన్, కార్తీక్‌లు తమ పరిధి మేరకు నటించారు. దర్శకుడు రవి నంబూరి అనుభవం ఉన్న దర్శకుడిలా ఇలాంటి సెన్సిటివ్ లవ్‌స్టోరీని తెరపై చక్కగా ఆవిష్కరించాడు. దర్శకులు పి.వాసు, కరుణకుమార్ అతిథి పాత్రల్లో మెరిశారు. మణిశర్మ సంగీతం ఈ చిత్రానికి చాలా ప్లస్ అయ్యింది. సాంకేతిక పరంగా ఆయనకే ఎక్కువ మార్కులు పడతాయి. పాటలన్నీ క్యాచీగా వినసొంపుగా ఉన్నాయి. నేపథ్య సంగీతం చిత్రంలోని సోల్‌ను నిలబెట్టింది. ఈ మధ్య కాలంలో మూడు గంటలపైగా నిడివితో విడుదలైన చిన్న సినిమా ఇదే. సినిమా లెంగ్త్ పెద్ద ప్రాబ్లమ్‌గా అనిపించకపోయినా, ట్రీమ్ చేసుకునే స్కోప్ మాత్రం కనిపించింది.

కొత్త తరహా ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ‘చెన్నై లవ్‌స్టోరీ’లో ప్రేమ గొప్పదనాన్ని, ప్రేమలోని నిజాయితీని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. తెలుగు సినిమాల్లో ఇప్పటి వరకు వచ్చిన సరికొత్త ప్రేమకథల్లో ఈసినిమాకు ఓ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సెన్సిబులిటీస్ మేళవించిన ఈ ప్రేమకథలో చిన్న చిన్న లోటుపాట్లు ఉన్నా, ప్రేమకథలను ఇష్టపడే అందరి హృదయాలను హత్తుకుంటుంది.



## రామాయణంలో సీతగా సాయి పల్లవి.. బుల్లితెర సీత దీపిక చిఖాలియా స్పందన

**నితేశ్ తివారీ రామాయణంలో సీత పాత్ర పాత్ర పోషిస్తున్న సాయి పల్లవి**
**సాయి పల్లవి అద్భుతమైన నటి అన్న దీపిక చిఖలియా**
**రణబీర్ కపూర్ కూడా అద్భుత నటుడు అని కితాబు**

నితేశ్ తివారీ రామాయణం చిత్రంలో టాలీవుడ్ నటి సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామానంద్ సాగర్ బుల్లితెర రామాయణంలో సీత పాత్రలో అమరిన దీపిక చిఖాలియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.“రణబీర్ కపూర్, సాయి పల్లవి ఇద్దరూ చాలా మంచి నటులు. సాయి పల్లవి పని చూశాను. ఆమె అద్భుతమైన నటి. రణబీర్ కూడా అద్భుత నటుడు. ఇద్దరూ తమ పాత్రలను అందంగా చూపిస్తారని నాకు నమ్మకం ఉంది” అని దీపిక చిఖలియా అన్నారు. దీపిక చిఖాలియా 1987లో రామానంద్ సాగర్ టీవీ ‘రామాయణం’లో సీత పాత్రలో నటించి భారతీయుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రామాయణం పార్ట్-1 దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రం భారీ బడ్జెట్ ప్రాజెక్టుగా రూపొందుతోంది. దీపిక చిఖలియా వ్యాఖ్యలు సాయి పల్లవి అభిమానుల్లో ఉత్సాహం నింపాయి.





# యూత్ హాకీ ఫైవ్స్ ఆసియా కప్‌లో భారత్ జోరు..
## పాకిస్థాన్‌పై 7-3తో ఘనవిజయం!

- పాకిస్థాన్‌పై 7-3 తేడాతో విజయం సాధించిన భారత పురుషుల జట్టు-ఒమన్‌పై 10-1తో అద్భుత విజయాన్ని నమోదు చేసిన భారత్
- ఒమన్ పర్యటనలో చెలరేగిన కేతన్ కుష్వాహా, షారూఖ్ అలీ-చైనా చేతిలో 3-6తో పోరాడి ఓడిన భారత మహిళల జట్టు
ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ5స్ వరల్డ్ కప్ క్వాలిఫయర్‌గా టోర్నీ



ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ ఆసియా ఛాంపియన్‌షిప్ 2026లో భారత సబ్‌జూనియర్ పురుషుల జట్టు అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతోంది. శుక్రవారం ఒమన్ వేదికగా జరిగిన మ్యాచుల్లో భారత్ రికార్డు విజయాలను సొంతం చేసుకుంది. ఒకే రోజులో మొదట ఆతిథ్య ఒమన్ జట్టును 10-1 తేడాతో చిత్తు చేసిన భారత్, ఆ తర్వాత జరిగిన హై-వోల్టేజ్ పోరులో సంప్రదాయ ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 7-3తో ఓడించి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. పాకిస్థాన్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో మ్యాచ్ ఆరంభం నుంచే భారత్ పూర్తి నియంత్రణ సాధించింది. ప్రథమార్ధంలోనే రోమిత్ పాల్ (8వ నిమిషం), కరణ్ గౌతమ్ (10వ నిమిషం), కెప్టెన్ కేతన్ కుష్వాహా (10వ నిమిషం) మెరుపు గోల్స్ సాధించడంతో భారత్ 3-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ద్వితీయార్ధంలో ప్రహ్లాద్ రాజ్‌భర్ (12వ నిమిషం) గోల్ కొట్టడంతో స్కోరు 4-0గా మారింది. ఆ తర్వాత పాకిస్థాన్ పుంజుకునే ప్రయత్నం చేసినప్పటికీ.. షారూఖ్ అలీ (16వ నిమిషం), రాహుల్ యాదవ్ (18వ నిమిషం), కుష్వాహా (20వ నిమిషం) వరుస గోల్స్‌తో విరుచుకుపడి 7-3తో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.



**ఒమన్‌పై 10-1తో గోల్స్ వర్షం!**

అంతకుముందు రోజు జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య ఒమన్‌ను భారత జట్టు కకావికలం చేసింది. ప్రథమార్ధంలోనే 6-0 ఆధిక్యంలో నిలిచిన భారత్, మ్యాచ్ ముగిసేసరికి 10-1తో తిరుగులేని విజయాన్ని ఖాయం చేసుకుంది. కెప్టెన్ కేతన్ కుష్వాహా ఏకంగా నాలుగు గోల్స్‌తో విరుచుకుపడగా.. షారూఖ్ అలీ, కరణ్ గౌతమ్, ప్రహ్లాద్ రాజ్‌భర్‌లు తలో రెండు గోల్స్‌తో చెలరేగారు. ఒమన్ తరఫున చివరి నిమిషంలో ఖజ్రాజ్ ఒక గోల్ సాధించాడు.

**చైనా చేతిలో పోరాడి ఓడిన మహిళల జట్టు**

మరోవైపు మహిళల విభాగానికి సంబంధించిన ఎలైట్ పూల్ మ్యాచ్‌లో భారత సబ్‌జూనియర్ మహిళల జట్టు చైనా చేతిలో 3-6 తేడాతో ఓటమి పాలైంది. ప్రథమార్ధంలో రెండు జట్లు 3-3తో సమానంగా నిలిచి గట్టి పోటీ ఇచ్చాయి. భారత్ తరఫున కిరణ్ ఎక్కా రెండు గోల్స్, సందీప కుమారి ఒక గోల్ సాధించారు. అయితే ద్వితీయార్ధంలో చైనా ప్లేయర్ గువో జియాక్సిన్ హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించడంతో భారత మహిళలకు ఓటమి తప్పలేదు. తొలిసారిగా జరగనున్న ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ వరల్డ్ కప్‌కు ఈ టోర్నీ ఆసియా ఖండం తరఫున అర్హత పోటీగా నిలవనుంది.



## రాజస్థాన్ వీడటం పెద్ద రిస్క్..
## ధోనీ ఒక్క మాటతో అంతా మారింది: సంజూ శాంసన్

టీమిండియా వికెట్ కీపర్-బ్యాటర్ సంజూ శాంసన్ తన ఐపీఎల్ కెరీర్‌కు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. 11 ఏళ్ల పాటు సుదీర్ఘ అనుబంధం ఉన్న రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం ఒక భారీ రిస్క్ అని, అయితే చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరడం వల్ల తనలో కొత్త శక్తి పుట్టుకొచ్చిందని అన్నాడు. జియోస్టార్ ‘సూపర్ స్టార్స్’ కార్యక్రమంలో మాట్లాడుతూ సంజూ ఈ ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. రాజస్థాన్ రాయల్స్‌తో తన బంధంపై సంజూ మాట్లాడుతూ.. “రాజస్థాన్ రాయల్స్‌ను వీడటం చాలా పెద్ద రిస్క్. ఒకసారి ఫ్రాంచైజీకి మీ మనసులో మాట చెప్పాక, వెనక్కి వెళ్లే మార్గం ఉండదు. ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలున్నాయి. మొదటిది, 2025 సీజనే ఆర్ఆర్‌తో నాకు చివరిదని నేను నిశ్చయించుకున్నా. నా కుటుంబం, నా భార్యతో సుదీర్ఘంగా చర్చించాను. ఇది ఆవేశపూరిత నిర్ణయమా? అని వాళ్లు అడిగారు. కానీ రెండు, మూడు వారాల చర్చల తర్వాత.. ఇదే సరైన సమయమని నిర్ణయించుకున్నా. రెండోది, నాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. సున్నా నుంచి మళ్లీ ప్రారంభించడానికి నేను ఎప్పుడూ సిద్ధంగా ఉంటాను. చెపాక్ లాంటి నెమ్మదైన వికెట్‌పై నా బ్యాటింగ్ శైలి సరిపోదని చాలామంది అన్నారు. కానీ, ‘నీకు 30 ఏళ్లు. ఏదో ఒక మార్గం కనుక్కో’ అని నాకు నేను చెప్పుకున్నాను. ఈ ఐపీఎల్ సీజన్‌లో ఏదో సాధించాలనే పట్టుదలతో, కొత్త ఉత్సాహంతో బరిలోకి దిగాను” అని వివరించాడు.

### ధోనీ సలహా.. మారిన తలరాత

2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్’గా నిలిచినప్పటికీ, సీఎస్‌కే తరఫున ఆడిన మొదటి మూడు మ్యాచ్ లలో సంజూ విఫలమయ్యాడు. ఆ సమయంలో జట్టు యాజమాన్యం నుంచి లభించిన మద్దతు, ముఖ్యంగా ఎంఎస్ ధోనీ ఇచ్చిన సలహా తనను ఎలా మార్చిందో సంజూ గుర్తుచేసుకున్నాడు.

# విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం

**- నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి**
**ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల బందుకు ఎంపిజె, జెహెచ్ఐ, ఐవైఎం, ఎస్ఐఓ సంపూర్ణ మద్దతు**




**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్, విద్యా వ్యవస్థలో జరిగిన అవకతవకలు మరియు విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఎంపిజె, జెఐహెచ్, ఐవైఎం, ఎస్ఐఓ సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఈ సంఘటనను నిరసిస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన విద్యాసంస్థల బందుకు పలు సంస్థలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా ప్రొద్దుటూరు శివాలయం సెంటర్‌లో నిరసన కార్యక్రమం లో నాయకులు మాట్లాడుతూ, దేశంలో పోటీ పరీక్షలపై విద్యార్థులు, తల్లిదండ్రులు నమ్మకం కోల్పోయే పరిస్థితులు ఏర్పడటం అత్యంత ఆందోళనకరమన్నారు. నీట్ పేపర్ లీక్ వంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మేము డిమాండ్ చేస్తున్నాము. అలాగే ఈ వ్యవహారంపై పారదర్శకమైన, నిష్పాక్షిక దర్యాప్తు జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, దేశంలోని అన్ని పోటీ పరీక్షలను పూర్తి పారదర్శకతతో నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతున్నాము విద్యార్థుల నిరసనల్లో ఈ డిమాండ్ దేశవ్యాప్తంగా వినిపిస్తోంది.

ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు. విద్యార్థుల గొంతును లాఠీలతో అణచివేయడం కాకుండా, వారి ఆందోళనలను ప్రభుత్వం ఆలకించి న్యాయం చేయాలి. విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని, లాఠీచార్జి ఘటనపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూడా మేము డిమాండ్ చేశారు. దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని, వారి హక్కులు, గౌరవం, భవిష్యత్తును కాపాడటం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, పట్టణ అధ్యక్షుడు హుషన్ బాష, కార్యదర్శి మమ్మద్ రఫీ, జమాత్ ఇస్లామి హింద్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ఎస్ మోహిద్దిన్,పట్టణ అధ్యక్షులు షఫీవుల్లా, కార్యదర్శి రహమతుల్లా, ఐవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బేపారి షఫీ, పట్టణ అధ్యక్షులు జబివుల్లా, ఎస్ఐఓ రాష్ట్ర కార్యదర్శి ఆదిల్ ఉమ్రి,పట్టణ అధ్యక్షుడు రోషన్ జమీర్, కార్యదర్శి ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి.

**- బంద్‌కు విరుద్ధంగా పేరెంట్స్ మీటింగ్‌లు పెట్టడం బాధాకరం**



**బ్రహ్మంగారిమఠం – సూర్య వాస్తవం:** దేశవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టిన నీట్ పేపర్ లీకేజీ ఘటనకు నైతిక, రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త బంద్‌లో భాగంగా బ్రహ్మంగారిమఠం మండలంలో బంద్ విజయవంతంగా నిర్వహించబడిందన్నారు. ఈ బంద్‌లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్ కుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సోమిరెడ్డిపల్లి అరవింద్ లు మాట్లాడుతూ... నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా చేపట్టిన బంద్‌కు అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతూ తమ విద్యాసంస్థలను మూసివేయడం అభినందనీయమన్నారు. అయితే ప్రభుత్వ విద్యాసంస్థల వద్ద పోలీసులను మోహరించి బంద్‌ను అడ్డుకునే ప్రయత్నం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. శాంతియుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా చేపట్టిన నిరసనలను అణచివేయడం తగదని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర, నిష్పాక్షిక విచారణ జరిపి బాధ్యులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వారిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనకు రాజకీయ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని విద్యార్థి, యువజన సంఘాలు కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు దేవకుమార్ ఎస్ఎఫ్ఐ నాయకులు సోమిరెడ్డిపల్లి ఓబులేసు, విజయ భాస్కర్, సందీప్, తిప్పన రాజా, ప్రభాస్, రమేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

# స్టాంప్ రైటర్లను తొలగించే జి.ఓ. నెం. 396ను తక్షణమే ఉపసంహరించుకోవాలి

**-- ఇర్ఫాన్ బాషా**



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** ప్రొద్దుటూరులో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట స్టాంప్ రైటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పెన్‌డౌన్ నిరసన కార్యక్రమంలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా స్టాంప్ రైటర్ల సమస్యలను తెలుసుకుని, వారికి కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ. నెం. 396 ద్వారా ఎన్నో సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్న స్వతంత్ర స్టాంప్ రైటర్లను తొలగించి, వారి స్థానంలో సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఫ్రంట్ ఆఫీస్ వ్యవస్థను ఏర్పాటు చేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. స్టాంప్ రైటర్లు కేవలం పత్రాలు రాసే వ్యక్తులు మాత్రమే కాదని, దశాబ్దాల అనుభవంతో ప్రతి డాక్యుమెంట్‌ను చట్టబద్ధంగా, భవిష్యత్‌లో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా రూపొందించే నిపుణులని పేర్కొన్నారు. ఒక సాధారణ వ్యక్తి జీవితాంతం కష్టపడి సంపాదించిన డబ్బుతో ఇల్లు లేదా స్థలం కొనుగోలు చేస్తాడని, కోట్ల రూపాయల విలువైన ఆస్తి అయినా సరే దానికి సంబంధించిన డాక్యుమెంట్ సరిగ్గా తయారుకాకపోతే భవిష్యత్‌లో తీవ్రమైన న్యాయపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈరోజు తయారయ్యే రిజిస్ట్రేషన్ పత్రాలు రాబోయే తరాలకు, వందల సంవత్సరాల పాటు ఆధారాలుగా నిలుస్తాయని, అలాంటి బాధ్యతను అనుభవం లేని వ్యక్తులకు అప్పగించడం ప్రజల ప్రయోజనాలకు విరుద్ధమని విమర్శించారు. అలాగే నిన్న స్టాంప్ రైటర్స్ సంఘం నాయకులను చర్చలకు పిలిచి, వారిపై ఒత్తిడి తెచ్చి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేయించాలని బెదిరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి, నైతిక విలువలకు విరుద్ధమని ఇర్ఫాన్ బాషా తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఈ నిర్ణయంతో భవిష్యత్‌లో సాధారణ ప్రజలపై అధిక భారం పడే అవకాశముందని, డాక్యుమెంట్లలో తప్పులు జరిగితే ప్రజలు కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తుందని, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తుందని అన్నారు. అంతేకాకుండా అధికారుల ఆధీనంలో జరిగే వ్యవస్థలో రాజకీయ వివక్షకు కూడా అవకాశం ఉంటుందని, ప్రజలకు సమానమైన సేవలు అందకపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వం వెంటనే జి.ఓ. నెం. 396ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ, స్టాంప్ రైటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అవసరమైతే స్టాంప్ రైటర్ల ఉద్యమంలో వంటా–వార్పు వంటి ఆందోళన కార్యక్రమాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రత్యక్షంగా పాల్గొంటుందని, వారి న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటానికి పూర్తి మద్దతు అందిస్తామని ఇర్ఫాన్ బాషా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, మైనారిటీ నాయకులు మౌలాలి, షేక్ గౌస్, స్టాంప్ రైటర్స్ అసోసియేషన్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్టాంప్ రైటర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయురాలు సునీత సహకారంతోనే మా కుమారుడు ఈ స్థాయికి చేరుకున్నాడు

**- మెగా పీటీఎంలో రాష్ట్ర స్థాయి విజేత విద్యార్థికి ఘన సత్కారం**



**మైదుకూరు, (బ్రహ్మంగారిమఠం ) – సూర్య వాస్తవం:** మైదుకూరు జడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు రామమోహన్ అధ్యక్షతన నిర్వహించిన మెగా పేరెంట్-–టీచర్ మీటింగ్ (పీటీఎం) అత్యంత వైభవంగా జరిగింది. విద్యార్థుల విద్యాభివృద్ధి, ప్రతిభా ప్రోత్సాహానికి వేదికగా నిలిచిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి లాంగ్ జంప్ పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన ఐఈడీ విద్యార్థి ఎన్. భద్రను మెడల్, ప్రశంసాపత్రం, నగదు పారితోషికంతో ఘనంగా సత్కరించారు. సత్కార కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనై మాట్లాడుతూ, "ప్రత్యేక విద్య ఉపాధ్యాయురాలు ఎస్. సునీత అందించిన నిరంతర శిక్షణ, ఆప్యాయత, ప్రోత్సాహం, సహకారం వల్లే మా కుమారుడు ఈ స్థాయికి చేరుకున్నాడు. ఆమె చూపిన అంకితభావం లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు" అంటూ కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రుల మాటలు సభలోని అందరినీ కదిలించాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి 'తల్లికి వందనం' వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం కీలకమని అన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయిలో విద్యార్థిని తీర్చిదిద్దిన ప్రత్యేక విద్య ఉపాధ్యాయురాలు ఎస్. సునీతను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఈడీ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, స్కూల్ స్టాఫ్ సెక్రటరీ ఆవుల శ్రీనివాసులు, ఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్, సీనియర్ ఉపాధ్యాయులు రాముడు, పద్మజ, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

**- పాల్గొన్న రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం:** మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చొరవతో. సిబ్యాల గ్రామం అభివృద్ధి.. అన్నమయ్యజిల్లా సిబ్యలగ్రామం జిల్లాపరిషత్ పాఠశాలలో మెగాపిటియం 4.0. తల్లిదండ్రులు. ఉపాధ్యాయుల. ఆత్మీయ సమావేశంలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. మెగా టీచర్స్ మీట్ అనేది విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు.అద్భుతమైన ఆలోచనకు నాంది పలికారని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. తల్లికి వందనం పేరుతో. విద్యార్థులకు. 15వేల రూపాయలు ఇవ్వడం చాలా శుభసూచకమని ఆ డబ్బులను వారి తల్లిదండ్రులు. విద్య అవసరాలకు వాడుకోవాలని.పిల్లల విషయంలో తల్లిదండ్రుల బాధ్యత చాలా బాధ్యతగా వ్యవహరించాలని. కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు అభిమానులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ప్రొద్దుటూరు కమీషనర్‌కు దక్కిన గౌరవం




**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** పోలవరం జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను జిల్లాలో సమర్థవంతంగా నడిపి 4.4 శాతం పాజిటివిటీ ప్రజలలో పెంచి విశేష సేవలు అందించిన ప్రొద్దుటూరు కమీషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలు, అధికారులు సమక్షంలో రంపచోడవరంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదిక మీద అభినందించారు. పోలవరం జిల్లా, రంపచోడవరం, జూనియర్ కాలేజీలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ రాష్ట్రస్థాయి ఆత్మీయ సమావేశంలో శ్రీనివాస విశ్వనాథ్ కు మానవవనరుల శాఖా మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఈ గౌరవం దక్కింది. ప్రొద్దుటూరు మున్సిపల్ కమీషనర్ గా రాకముందు శ్రీనివాస విశ్వనాథ్ పోలవరం జిల్లాకు పి.జీ.ఆర్.ఎస్ నోడల్ అధికారిగా వ్యవహారించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

## లేడీస్ టార్గెట్..క్షణాల్లో చైన్ స్నాచింగ్
## చెన్నై "కిలాడీ"ల ఆటకట్టించిన సూళ్లూరుపేట పోలీసులు!

**-రూ.19 లక్షల విలువైన 96 గ్రాముల బంగారం, కేటీఎం బైక్ స్వాధీనం.**

**పలు చోరీ కేసుల గుట్టురట్టు..వివరాలు వెల్లడించిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు.**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** పగటి పూట ఒంటరిగా వెళ్లే మహిళలే లక్ష్యంగా కేటీఎం బైక్‌పై వచ్చి కంటిరెప్ప మూసి తెరిచేలోగా బంగారు గొలుసులు తెంచుకెళ్తున్న అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ల ఆటకట్టించారు సూళ్లూరుపేట పోలీసులు. చెన్నైకి చెందిన ఇద్దరు కేటాయింపు దొంగలను అరెస్టు చేసి,వారి వద్ద నుంచి రూ.18 లక్షల విలువైన 96 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.1 లక్ష విలువైన కేటీఎం డ్యూక్ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.నాయుడుపేట డీఎస్పీ జి. చెంచుబాబు శుక్రవారం సూళ్లూరుపేట సీఐ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు.వరుస చోరీలపై తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు ఆదేశాలతో,అదనపు ఎస్పీ క్రైమ్స్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ జి.అజయ్‌కుమార్‌ల బృందం రంగంలోకి దిగింది.ఘటనా స్థలాల్లో లభించిన సీసీటీవీ దృశ్యాలు,సాంకేతిక ఆధారాలను క్షుణ్ణంగా విశ్లేషించిన పోలీసులు.శుక్రవారం ఉదయం వెంగమాంబ ఆర్చ్ వద్ద తనిఖీలు చేస్తూ చెన్నై కొరుక్కుపేటకు చెందిన కె.మోహిన్ (33), మరియదాస్ ఆనంద్ (20) లభించడంతో అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితులు నేరాలను అంగీకరించారు.మే నెలలో తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లో కేటీఎం బైక్‌ను దొంగిలించి,దాంతో సూళ్లూరుపేటలోని కరెంట్ ఆఫీస్ వీధి,ఆర్యభట్ట నగర్,బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ వీధుల్లో నలుగురు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను తెంచుకెళ్లినట్లు తెలిపారు.అరెస్టయిన మోహిన్‌పై తమిళనాడులో 15,ఆంధ్రాలో 6 కేసులు ఉండగా.. ఆనంద్‌పై తమిళనాడులో 12,ఆంధ్రాలో 6 కేసులున్నాయని డీఎస్పీ తెలిపారు. సూళ్లూరుపేటలోని 4 ప్రధాన కేసులను ఛేదించి, సొత్తును రికవరీ చేసిన సీఐ మురళీకృష్ణ,ఎస్ఐ అజయ్‌కుమార్,క్రైమ్ టీమ్‌ను డీఎస్పీ చెంచు బాబు అభినందించారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల
## పాఠశాల అండ్ కళాశాలలో పేరెంట్స్--టీచర్స్ సమావేశం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐ మురళీ కృష్ణా**



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** సూళ్లూరుపేట పట్టణంలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల అండ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పేరెంట్స్--టీచర్స్ సమావేశానికి ముఖ్యతిథిగా సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ పాలొగొన్నారు.ఈ సందర్భంగా,విద్యార్థుల కోసం మాదకద్రవ్యాల నివారణ (యాంటీ డ్రగ్స్),ఈవ్ టీజింగ్,సోషల్ మీడియా మోసాలు,సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,మహిళలు, బాలికల పట్ల గౌరవంగా వ్యవహరించాలని,సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. ద

అలాగే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అను మానాస్పద సంఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూళ్లూరు పేట సీఐ మురళీకృష్ణ , కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తల్లిదండ్రులు, సుమారు 1,060 మంది బాలికలు పాల్గొన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు సమాజంలో నేరాల నివారణకు,విద్యార్థుల్లో మంచి విలువలను పెంపొందించడానికి ఎంతో దోహదపడతాయని సీఐ తెలిపారు.

## వాతావరణ మార్పులకు అనుగుణంగా
## మత్స్య ఆధారిత జీవనోపాధులపై మహిళలకు శిక్షణ

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** గ్రీన్ క్లైమేట్ ఫండ్ (జీసీఫ్)--ఈసీఆర్ఐసీసీ (ఎక్రిక్ ) ప్రాజెక్టు ఆధ్వర్యంలో,గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) మరియు మత్స్యశాఖ సంయుక్తంగా నెలపట్టు పక్షుల అభయారణ్యం మరియు పరిసర ప్రాంతాల పరిధిలోని మహిళా లబ్ధిదారులకు దొరవారిసత్రం సెర్ప్ కార్యాలయంలో "విలువ గొలుసు బలోపేతం మరియు మార్కెట్ అనుసంధానం ద్వారా వాతావరణ అనుకూల జీవనోపాధులు,వ్యాపారాల అభివృద్ధి" అనే అంశంపై ఒకరోజు సామర్థ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సెర్ప్ ఏపీఎం మునిరాజయ్య అధ్యక్షత వహించగా,ప్రాజెక్టు పరిధిలోని 60 మంది మహిళా లబ్ధిదారులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో వ్యవసాయ శాఖ వ్యవసాయ అధికారి జ్యోతిర్మయి,ఏఎస్ఓ పి. ప్రసూన,ఏపీఓ ఉషారాణి,ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకుడు శ్రీనివాసులు, జీసీఎఫ్--ఈసీఆర్ఐసీసీ జిల్లా సమన్వయ అధికారి డా.ఎన్.జస్వంత్ పాల్గొన్నారు.అలాగే డిజిటల్ ఫైనాన్షియల్ కోఆర్డినేటర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు (సీసీలు),గ్రామ వ్యవసాయ సంఘాల (వివోఏ లు), రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) డైరెక్టర్లు కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ,సముద్రపు నాచు (సీవీడ్ ) సాగు, అలంకార చేపల పెంపకం (ఆర్నమెంటల్ ఫిషరీస్ ) వంటి మత్స్య ఆధారిత జీవనోపాధులు తీర ప్రాంత మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులను అందించడమే కాకుండా వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుతాయని తెలిపారుమార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు, విలువ గొలుసు బలోపేతం ద్వారా మహిళలకు దీర్ఘకాలిక ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు.శిక్షణలో సముద్రపు నాచు సాగు, అలంకార చేపల పెంపకం,విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ,మార్కెటింగ్ అవకాశాలు, వాతావరణ మార్పులకు అనుగుణమైన మత్స్య ఆధారిత జీవనోపాధులపై సాంకేతిక అంశాలను నిపుణులు వివరించారు.పాల్గొన్న మహిళలు సందేహాలను నివృత్తి చేసుకుని,తమ గ్రామాల్లో ఈ జీవనోపాధులను అమలు చేసేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలను పొందారు.



# ప్రపంచ వేదికపై ఏపీ ప్రభుత్వ వైద్య కళాశాలల ఘనత

**- పోలియో టీకాపై కీలక పరిశోధనకు"ది లాన్సెట్" గుర్తింపు'-ఆంధ్ర,కర్నూలు మెడికల్ కాలేజీలకు అంతర్జాతీయ గౌరవం..**

**- పరిశోధక వైద్యులు చక్రవర్తి,విజయానంద్ కు మంత్రి సత్య కుమార్ యాదవ్ అభినందనలు..**

**- ఇదే స్ఫూర్తిని మిగిలిన కళాశాలలు కూడా కొనసాగించాలని మంత్రి సత్య కుమార్ ఆకాంక్ష**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :**

అమరావతి :-ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రపంచస్థాయి వైద్య పరిశోధనల్లో తమ ప్రతిభను చాటాయి.చిన్నారులకు ఇచ్చే పోలియో టీకాపై నిర్వహించిన కీలక అంతర్జాతీయ పరిశోధన ప్రపంచ ప్రఖ్యాత"ది లాన్సెట్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్" జర్నల్‌లో ఈ ఏడాది మే 15న ప్రచురితమైంది. దేశంలోని తొమ్మిది ప్రముఖ వైద్య విద్యా సంస్థలు పాల్గొన్న ఈ బహుళ కేంద్రాల అధ్యయనంలో విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్--కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్),కర్నూలు మెడికల్ కాలేజ్ కీలక భాగస్వాములుగా నిలవడం రాష్ట్ర వైద్య విద్య, పరిశోధన రంగాలకు మరో అంతర్జాతీయ గుర్తింపును తీసుకొచ్చింది.

**"643 మంది శిశువులపై అధ్యయనం"**

ఈ పరిశోధనను సుమారు రెండేళ్లపాటు ఫేజ్-2/3, డబుల్-బ్లైండ్,ర్యాండమైజ్డ్ కంట్రోల్డ్ క్లినికల్ ట్రయల్‌గా నిర్వహించారు.తొలి దశలో 100 మంది శిశువులపై,అనంతరం మొత్తం 643 మంది శిశువులపై అధ్యయనం చేపట్టారు.విశాఖలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్--కేజీహెచ్‌లో డా చక్రవర్తి ఆధ్వర్యం లో వంద మందికి పైగా చిన్నారులు ఈ పరిశోధనలో పాల్గొన్నారు.ఈ పరిశోధన లో కీలక భూమిక పోషించింది.కర్నూలు మెడికల్ కాలేజ్ కూడా ఈ పరిశోధన లో తన పాత్ర చక్కగా నిర్వహించింది.

**"తొమ్మిదిలో రెండు మన కళాశాలలే"**

ఈ బహుళ కేంద్రాల పరిశోధనకు సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా,పుణె సమన్వయ సంస్థగా వ్యవహరించింది.ఐసీఎంఆర్--నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఇన్ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్స్ (కోల్‌కతా), పీజీఐఎంఈఆర్(చండీగఢ్)తోపీవాలా నేషనల్ మెడికల్ కాలేజ్--నాయర్ ఆసుపత్రి (ముంబయి), భారతి విద్యాపీఠ్ మెడికల్ కాలేజ్ (పుణె)మైసూరు మెడికల్ కాలేజ్,ఐఎంఎస్--సమ్ హాస్పిటల్ (భువనేశ్వర్)తో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన ఆంధ్ర మెడికల్ కాలేజ్,కర్నూలు మెడికల్ కాలేజ్‌లను అధ్యయన కేంద్రాలుగా ఎంపిక చేయడం విశేషం.ప్రభుత్వ వైద్య కళాశాలలు దేశంలోని అత్యుత్తమ వైద్య సంస్థల సరసన నిలిచి ప్రపంచ స్థాయి పరిశోధనలో భాగస్వాములు కావడం రాష్ట్రానికి గర్వకారణంగా మారింది.

**"పరిశోధనలకు ప్రాధాన్యం:మంత్రి సత్య కుమార్"**

రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్య, వైద్య సేవలు, పరిశోధనలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఆధునిక మౌలిక సదుపాయాలు,క్లినికల్ పరిశోధనలకు అవసరమైన వాతావరణం,అధ్యాపకులకు ప్రోత్సాహం ఇస్తున్నామని చెప్పారు."ప్రపంచంలో అత్యంత ప్రతిష్ఠాత్మక వైద్య జర్నళ్లలో ఒకటైన ది లాన్సెట్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్'లో ఆంధ్ర మెడికల్ కాలేజ్,కర్నూలు మెడికల్ కాలేజ్ భాగస్వామ్యంతో పరిశోధన ప్రచురితమవడం రాష్ట్ర వైద్య రంగానికి గర్వకారణమ"ని పేర్కొన్నారు.పరిశోధక వైద్యులు డాక్టర్ చక్రవర్తి డాక్టర్ విజయనశీద్ ల బృందానికి అభినందనలు తెలిపారు.

# విద్యార్థుల విజయమే లక్ష్యంగా మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ 4.0

**- నాయుడుపేట జెడ్పీ బాలికల పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొని విద్యార్థులతో మమేకం**



**నాయుడుపేట- సూర్య వాస్తవం:** నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్--టీచర్స్ మీటింగ్ (యం పి టీ యం) 4.0 కార్యక్రమం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఉత్సాహభరిత భాగస్వామ్యంతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయంగా మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. అనంతరం చిన్నారులతో ముచ్చటిస్తూ వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, ఆశయాల గురించి తెలుసుకున్నారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థుల అభిమానానికి గుర్తుగా వారితో కలిసి సెల్ఫీలు దిగుతూ ఆప్యాయంగా గడిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అనేక సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థికి మెరుగైన విద్యను అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. "మిషన్ మార్చి--2027" ద్వారా పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి విజయం సాధించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయుడుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమన్నారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసంపై ఇరువర్గాలు సమన్వయంతో పనిచేస్తేనే వారు ఉన్నత లక్ష్యాలను చేరుకోగలరని అన్నారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కుటుంబం, పాఠశాల రెండూ సమాన బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.ఈ సమావేశంలో విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రతిభా వికాసం, హాజరు శాతం, పరీక్షల ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, ప్రభుత్వ విద్యా సంస్కరణలు, మౌలిక సదుపాయాలపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.



## భవిష్యత్ పునాదికి విద్యే ప్రామాణికం

**- "ఎస్సై జి వి.చౌదరి "**



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం :** ప్రతి విద్యార్థి ఆర్థికంగా స్థిరపడాలన్నా,విద్యే ప్రామాణికంగా భవిష్యత్ పునాది వేసుకోవాలని ఎస్సై జీవి చౌదరి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మావిళ్ళపాడు ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల ఆత్మీయ (మెగా పి.టి ఎమ్ ) సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మీపై తల్లిదండ్రులు పెంచుకున్న ఆశలను నెరవేర్చి విద్యారంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని వివరించారు.యువత చెడు వ్యసనాలు బాట పట్టకుండా,సత్ప్రవర్తనతో ముందుకు సాగాలని పేర్కొన్నారు.ప్రధానంగా ప్రతి విద్యార్థి ఓ లక్ష్యాన్ని గురి చేసుకుని గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు.ప్రధానంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని గుర్తు చేశారు.నేటి బాలలే -రేపటి ప్రభుత్వ అధికారులు అన్న రీతిలో మీరు కూడా ఉన్నత ఉద్యోగాలే లక్ష్యంగాపెట్టుకుని సాధించాలన్నారు.అనంతరం హాజరైన అధికారులకు ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్ సుమలత,సిబ్బంది వారిని ఘనంగా సత్కరించారు. తల్లిదండ్రులకు పలు రకాల ఆటల పోటీలు ఏర్పాటు చేశారు.మండల కేంద్రంలోని ఎం జె పి బాలుర గురుకులం,బాలికల కస్తూర్బా గాంధీ విద్యాలయం, ఏకొల్లు ఉన్నత పాఠశాలల్లో కూడా మెగాపిటీఎం కార్యక్రమాలను ఘనంగా ఏర్పాటు చేశారు.పిల్లల ప్రవర్తన,మార్పు,విద్యలో ప్రతిభను పర్యవేక్షిస్తూ సలహాలు సూచనలు కూడా ఇవ్వాలని ఎంఈఓ కొండయ్య ప్రసంగించారు ఆ పాఠశాలల్లో హాజరైన తల్లిదండ్రులకు టగ్ ఆఫ్ వార్,మ్యూజికల్ చైర్, వంటి ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేశారు.పాఠశాలల్లో జరిగిన మెగా పేటీఎం కార్యక్రమంలో సంబంధిత ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులైన పార్వతి,తిరుపతయ్య, సిహెచ్ సుమలత,ఎస్సై జీవి చౌదరి, తొగరాముడి పీహెచ్సీ సూపర్వైజర్ ఎస్ జనార్ధన్, ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతులు భూసార పరీక్షలు చేయించుకుని
## వాటి ఆధారంగా ఎరువులు వాడాలి

**- శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ రావు**

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం :** ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడాలని అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ నెల్లూరు శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ రావు అన్నారు. ఆయన శుక్రవారం దొరవారిసత్రం మండలంలోని తల్లంపాడు గ్రామంలో ఎస్.పి.ఎస్.ఆర్ నెల్లూరు ఆత్మ వారి సౌజన్యంతో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలపై శిక్షణ కార్యక్రమంలో అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ నెల్లూరు నుండి శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూదన్ రావు,డాక్టర్ శ్రీ లక్ష్మి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావు మాట్లాడుతూ రైతులు భూసార పరీక్ష చేయించుకొని వాటి ఆధారంగా ఎరువులు వాడాలని యూరియా వాడకం తగ్గించుకోవాలని ఒక సీజన్‌కి యూరియా ఒక ఎకరానికి మూడు బస్తాలు చొప్పున మాత్రమే వాడాలని అంతకుమించి ఎక్కువ బస్తాలు వాడితే తెగుళ్ల బెడద ఎక్కువ అవుతుందని తెలిపారు.పొటాషియం వేయలేని పరిస్థితుల్లో 13:0:45 అని న్యూట్రియంట్ ను200 గ్రాములు ఒక ఎకరమునకు పిచికారి చేసుకోవచ్చు అని తెలిపారు.డాక్టర్ శ్రీ లక్ష్మి గారు మాట్లాడుతూ ఎన్ఎల్ఆర్ 3648 అనే వంగడం గురించి రైతులకు తెలిపారు.ఇది అగ్గి తెగులు రాకుండా తట్టుకుంటుందని ఖరీఫ్ కి బాగా అనువైన రకము అని 130 రోజుల పంట అని దిగుబడి 30 నుంచి 34 క్వింటాళ్లు ఎకరానికి వస్తుందని తెలిపారు.అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ నెల్లూరు నందు ఈ రకము అందుబాటులో ఉందని ఎవరైనా రైతులు కావాలి అనుకుంటే వారిని సంప్రదించవచ్చు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జ్యోతిర్మయి ఏఎస్ఓ ప్రసన్న ఏవో గవాస్కర్ పాల్గొన్నారు.

